PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 287 | విజయవాడ, శనివారం 20 మే 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 20 May 2023 | Rs



మెటాలో మళ్లీ 6,000 మందిపై వేటు

● లోపలి పేజీలో.. ●



విజయవాడ లెనిన్ సెంటర్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



రూ.2,000 నోట్లు వెనక్కి

- సెప్టెంబర్ 30 వరకు గడువు
- అప్పటి వరకు చలామణీలోనే..
- మార్పిడికి పరిమితి విడతకు రూ.20 వేలు
- డిపాజిట్‌కు పరిమితి లేదు
- అన్ని బ్యాంకుల్లోనూ మార్చుకోవచ్చు
- ఆర్‌బిఐ కీలక ఆదేశాలు
- నోట్ల రద్దు అవాంఛనీయ బిడ్డే ఈ పెద్ద నోటు అని వ్యాఖ్య

ముంబయి: రానున్న అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, మరో ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రం రూ.2,000 నోట్ల ఉపసంహరణకు పూనుకుంది. ఈ సారి ప్రభుత్వం నేరుగా కాకుండా భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) చేత ఈ ప్రకటన చేయించింది. 'క్లీన్ నోట్ పాలసీ' కింద రూ.2,000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు ఆర్బీఐ శుక్రవారం నాడిక్కడ వెల్లడించింది. ఇందుకు సెప్టెంబర్ 30 వరకు గడువు ఇచ్చింది. ఈ నెల 23 నుంచి రూ.2,000 నోట్లను అన్ని బ్యాంకుల్లో మార్చుకోవచ్చని తెలిపింది. అప్పటి వరకు పెద్ద నోట్లను చట్టబద్ధంగా లావాదేవీలకు ఉపయోగించు కోవచ్చని తెలిపింది. 2018 నోట్ల రద్దు నుంచి పుట్టుకొచ్చిన అవాంఛనీయ బిడ్డే ఈ రూ.2,000 నోటు అని అది వ్యాఖ్యానించింది. ఇకపై ఎవరికీ రూ.2వేల నోట్లను జారీ చేయవద్దని బ్యాంక్‌లకు ఆదేశాలు జారీ చేసింది. మే 23 నుంచి ఏ బ్యాంక్ శాఖలో అయినా ఈ నోట్లను మార్చుకోవడానికి ప్రజలకు వీలు కల్పించింది. అయితే.. ఒకసారి రూ.20,000 వరకు మాత్రమే ఈ నోట్లను మార్చుకునేందుకు వీలుంది. వ్యక్తిగతంగా డిపాజిట్ చేయాలనుకుంటే ఎలాంటి నిబంధన లేకుండా ఎంత మొత్తం అయినా డిపాజిట్ చేసుకునే వీలు కల్పించింది. దేశంలోని 19 ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాల్లోనూ రూ.2వేల నోట్లు మార్చుకునే సౌలభ్యం కల్పించింది. 2016 నవంబర్ 8న ప్రధాని మోడీ అనుహ్యంగా రూ.500, రూ.1000 పెద్ద నోట్లను రద్దు చేస్తున్నామని ప్రకటించారు. వాటికంటే పెద్ద నోటు రూ.2000 తెచ్చిన మిగతా 5లో

శ్రామిక రాజ్యంతోనే సంక్షేమం

- సమాజ పురోగమనానికి శ్రమించిన సుందరయ్య
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయవాడ

అభ్యుదయ భావాలతో సమాజం అన్ని రకాలుగా పురోగమించాలని సుందరయ్య ఆకాంక్షించారని, అందుకోసం ఉద్యమాలు నిర్మించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ లెనిన్ సెంటర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్థంతి సభ జరిగింది. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశం ముందుకెళ్లాలనే రాజకీయాలను సుందరయ్య ఆచరించారని గుర్తుచేశారు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం రావాలని, కష్టపడే కార్మికుడికి, వ్యవసాయ కార్మికుడికి గిట్టుబాటు కూలి రావాలని, రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఇవన్నీ ఒక్క శ్రామిక రాజ్యంలోనే సాధ్యమని తెలిపారు.

అందుకోసం సుందరయ్య తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అభివృద్ధి నిరోధకంగా తయారైందన్నారు. దేశాన్ని వేల సంవత్సరాలు వెనక్కి నెట్టేవిధంగా సైన్స్‌ను సైతం వినియోగించుకుంటోందన్నారు. ఏ దేవుడిని పూజించాలి, ఏ మతాన్ని ఆచరించాలి, ఏ తిండి తినాలి, ఏ బట్ట కట్టాలనే అంశాలను నేడు మతోన్మాద బిజెపి శాసిస్తోందన్నారు. ప్రజలు, శ్రామికులు, కష్టజీవులు శ్రమించి సాధించుకున్న దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని విమర్శించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం జీవితాంతం పరితపించి, పోరాడిన మహానేత సుందరయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టులు పోరాడాలని పిలుపునిచ్చారు. తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని దేశ రాజధాని ఢిల్లీలో రెజ్లింగ్ మహిళా క్రీడాకారులు పోరాడుతుంటే, వారి సమస్యను పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం అత్యంత క్రూరంగా వ్యవహరిస్తోందన్నారు. ఇటువంటి కీచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు లౌకిక శక్తులంతా ఐక్యంగా కదలాలని కోరారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీదేవి, పిఎన్‌ఎం జిల్లా కార్యదర్శి అప్పన్న, షకీల తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు పిఎన్‌ఎం కళాకారులుప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సుందరయ్య కదంబం తదితర 20 రకాల కళా రూపాలను చిన్నారులు ప్రదర్శించారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి బిజెపి ముప్పు

- మతరాజ్యంతో సమాజ విచ్ఛిన్నం
- లోక్‌సభ పూర్వ సెక్రెటరీ జనరల్ పిడిటి చారి
- హైదరాబాద్‌లో సుందరయ్య 38వ స్మారకోపన్యాసం


6

హడావుడిలో నాసిరకం

- వేరుశనగ విత్తన నాణ్యత ప్రశ్నార్థకం
- అంతా ట్రూత్‌ఫుల్ సీడ్
- ఆఫ్‌లైన్ పంపిణీకీ వెసులుబాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రానున్న ఖరీఫ్‌లో రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయతలపెట్టిన సబ్సిడీ వేరుశనగ విత్తనాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. విత్తనాల సేకరణ ప్రక్రియను వీలైన మేరకు ఆలస్యం చేసి, చివరి నిమిషంలో హడావుడి పడి, ఇదే అదనుగా నాణ్యతాప్రమాణాలు పాటించకుండా నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టే ఎత్తుగడ అమలు చేస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. సేకరణ టెండర్ల దగ్గరే విపరీతమైన జాప్యం జరిగింది. దాంతో మే మూడవ వారం వచ్చినా లక్ష్యంలో 40 శాతంలోపే సేకరించారని తెలుస్తోంది. ప్రాసెస్ దశలో ఉన్నట్లు చెబుతున్నారు. మామూలుగా మార్చి, ఏప్రిల్‌లో విత్తనాల సేకరణ తతంగం మొదలవుతుంది. మే రెండో వారానికల్లా సేకరణ పూర్తి చేసి, మూడవ వారంలో పంపిణీ ప్రారంభించేవారు. ముందటేడు వరకు అలాగే చేశారు. నిరుడు మే చివరిలో పంపిణీ మొదలు పెట్టారు. ఈ తడవ సైతం అదే తంతు రిపీట్ అవుతోంది. మే 29న లాంఛనంగా విత్తన పంపిణీని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రారంభించాలనుకుంటున్నారు. సాధారణంగా తొలకరి వానలు రాగానే విత్తుతారు. అదనుకు విత్తనం అందుబాటులో లేకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.





నిబంధనల సడలింపు

ముందటేడు వరకు 'రైతు నుంచి రైతుకు' కాన్సెప్టుతో నేరుగా వ్యవసాయశాఖ ద్వారా రైతుల నుంచి విత్తనకాయలను సేకరించి, ఎపి సీడ్స్‌తో ప్రాసెసింగ్ చేయించి అందించారు. టార్గెట్‌లో కొంత భాగాన్నే టెండర్ల ద్వారా ట్రేడర్ల నుంచి సేకరించారు. నిరుడు, ఈయేడు మొత్తానికీ టెండర్ల ద్వారా వ్యాపారుల నుంచి సేకరిస్తున్నారు. వ్యాపారులు నాణ్యతాప్రమాణాలు పాటించకుండా బహిరంగ మార్కెట్‌లో ఖరీఫ్ పంటను తక్కువ ధరకు కొని వాటినే కొద్దిగా ప్రాసెస్ చేసి ఎపి సీడ్స్‌కు సరఫరా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వంద గ్రాముల విత్తన కాయల నుంచి తాలుతప్ప పోను కనీసం 70 గ్రాముల గింజలు రావాలి. ఇప్పుడా పరిస్థితి లేదంటున్నారు. ధ్రువీకరణ విత్తనాలే ఇవ్వాల్సి ఉండగా మొత్తం ట్రూత్‌ఫుల్ సేకరిస్తున్నారు. సర్టిఫైడ్ సీడ్‌పై వ్యవసాయశాఖ నియంత్రణ ఉంటుంది. ట్రూత్‌ఫుల్‌కు అదేమీ పెద్దగా ఉండదు. ట్రేడర్లు నాసిరకం విత్తనాలను అంటగట్టడానికి 'ట్రూత్‌ఫుల్' బాగా ఉపయోగపడుతుంది. రైతు భరోసా కేంద్రాల్లో డి-క్రిషి యాప్ ద్వారా సబ్సిడీ విత్తనాలివ్వాలని, సర్కారీ సబ్సిడీ మినహాయించి మిగతా అమౌంట్‌ను రైతులు ముందే చెల్లించాలనే నిబంధన ఉంది. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో కూడా విత్తనాలిస్తామంటున్నారు. ఆఫ్‌లైన్ అనడంతో పంపిణీ లెక్కలు తారుమారయ్యే అవకాశం ఉంది.

అసలే కోతలు

రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ లక్ష్యాలు రానురాను తగ్గిపోతున్నాయి. ముందటేడు టార్గెట్ నాలుగున్నర లక్షల క్వింటాళ్లుకాగా నిరుడు మూడున్నర లక్షల క్వింటాళ్లు. అవీ మొత్తం పంపిణీ చేయలేదు. ఈసారి లక్ష్యం 2.92 లక్షల క్వింటాళ్లకు తగ్గించారు. వేరుశనగ ఎక్కువగా సాగు చేసే ఉమ్మడి అనంతపురం జిల్లాకు 1.88 లక్షల క్వింటాళ్లు టార్గెట్‌గా నిర్ణయించారు. మిగతా జిల్లాలకు మరో లక్ష క్వింటాళ్లు ఇస్తామంటున్నారు.





అవినాష్‌రెడ్డి అనుచరుల ధ్వంసం చేసిన మీడియా కారు, కెమెరాలు

మళ్లీ గైర్హాజరు

- నా తల్లికి గుండెపోటు వచ్చింది
- విచారణకు రాలేకపోతున్నాను
- సిబిఐకి ఎంపి అవినాష్ రెడ్డి లేఖ
- మీడియా సిబ్బందిపై ఆయన అనుచరుల దాడి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపి అవినాష్‌రెడ్డి శుక్రవారం కూడా సిబిఐ విచారణకు హాజరు కాలేదు. విచారణకు హాజరయ్యేందుకు వేకువజామునే ఆయన పులివెందుల నుంచి హైదరాబాద్ వచ్చారు. అయితే, అవినాష్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మికి గుండెపోటు రావడంతో శుక్రవారం ఉదయం ఆమెను పులివెందులలోని ఇసి గంగిరెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలిసిన వెంటనే అవినాష్ రెడ్డి సిబిఐ అధికారులకు లేఖ రాశారు. తన తల్లి అనారోగ్య కారణాల దృష్ట్యా విచారణకు రాలేనని, తన తండ్రి జైల్లో ఉన్నారని, తన తల్లిని తానే చూసుకోవాల్సి ఉందని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమెకు పులివెందులలోని ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారని, అక్కడకు వెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు అవినాష్ రెడ్డి తరుపు న్యాయవాది మల్లారెడ్డి లిఖిత పూర్వకంగా సిబిఐ అధికారులకు సమాచారమిచ్చారు. హైదరాబాద్ నుంచి పులివెందులకు అవినాష్‌రెడ్డి బయల్దేరారు. శ్రీలక్ష్మికి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అంబులెన్సులో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో తాడిపత్రి మండలం చుక్కలూరు వద్ద ఆయనకు తన తల్లిని తీసుకొస్తున్న అంబులెన్స్ ఎదురైంది. వాహనం దిగివెళ్లి తల్లిని చూసిన అవినాష్ రెడ్డి... అంబులెన్స్ వెంట తిరిగి హైదరాబాద్ బయల్దేరారు. శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితి కొంత ఇబ్బందిగా మారడంతో ఆమెను కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రికి తరలించారు. అక్కడే అవినాష్ రెడ్డి కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు సమాచారం. అవినాష్ రెడ్డి లేఖను స్వీకరించిన సిబిఐ... తిరిగి ఎప్పుడు విచారణకు హాజరు కావాలనేది వెల్లడించలేదు.

మీడియాపై ఎంపి అనుచరులు దాడి

ఎంపి అవినాష్ రెడ్డి హైదరాబాద్ నుంచి పులివెందులకు వస్తున్న సమయంలో కవర్ చేస్తున్న మీడియా ఛానళ్ల ప్రతినిధులపై ఆయన అనుచరులు దాడి చేశారు. మాసాబ్ ట్యాంక్ సమీపంలో మీడియా వాహనాలను ఆపి వాటి అద్దాలను పగులగొట్టారు. మీడియా ప్రతినిధులపై చేయి చేసుకుని, వారి కెమెరాలను ధ్వంసం చేశారు. మీడియాపై దాడిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. దాడులకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని పోలీసు ఉన్నతాధికారులను కోరింది. కాగా, సిబిఐ విచారణకు అవినాష్‌రెడ్డి చివరి నిమిషంలో గైర్హాజరు కావడం వరుసగా ఇది రెండోసారి. ఈ నెల 16న ఆయన విచారణకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ముందస్తు కార్యక్రమాలను కారణంగా చూపుతూ హైదరాబాద్ నుంచి కడప వెళ్లిపోయారు. దీంతో, సిబిఐ బృందం అంతేవేగంగా కడప చేరుకోవడం, అవినాష్‌రెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఈ నెల 19న విచారణకు రావాలంటూ ఆయన డ్రైవర్‌కు నోటీసు ఇవ్వడం ఉత్కంఠ రేపింది.


వలంటీర్లు సంక్షేమ సారథులు

అవార్డుల ప్రదానంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధులు, సంక్షేమ సారథులు వలంటీర్లేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఉదయాన్నే తలుపుతట్టి అర్హులకు పింఛన్లు ఇచ్చే వలంటీర్ల సేవలు మరువలేనివని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన 64 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్న గొప్ప సేవకులని కొనియాడారు. 2.66 లక్షల మంది వలంటీర్లు తనకు తోడుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు అందిస్తున్నారని తెలిపారు.

25 సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ప్రజలకు వలంటీర్లు విశేష సేవలందిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరుతో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాయని వివరించారు. జన్మభూమి కమిటీల వంటి అరాచకాలు ఇప్పుడు లేవని, వివక్ష, లంచాలకు తావులేకుండా పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలనూ వలంటీర్ల చేతుల మీదుగానే అందజేస్తున్నామన్నారు. వారంతా 25 పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లని వివరించారు. అయినా కొంతమంది గిట్టనివారు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు. మంచి తప్ప చెడు చేయాలనే తలపు లేకుండా బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఇది స్వచ్ఛంద సేవ మాత్రమేనని, వీరెవరూ ప్రభుత్వ ఉద్యోగులు కారని అన్నారు. వలంటీర్లనే లీడర్లుగా చేస్తానని గతంలోనే అన్నానని, అదే చేస్తానని చెప్పారు. ఇప్పటి నుండి పదిరోజుల పాటు సత్కరించే కార్యక్రమం ఉంటుందని, ఈ ఏడాది 2,33,719 మందికి సత్కారం చేస్తున్నామని తెలిపారు. దీనికోసం ప్రభుత్వం తరపున రూ.239 కోట్ల 69 లక్షలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాదీ ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మొదటిస్థాయిలో 2,28,624 మంది సేవారత్నలకు మండలస్థాయిలో రూ.పది వేలు చొప్పున నగదుతో సత్కారం జరుగుతుందని పేర్కొన్నారు. రెండోస్థాయిలో 4,220 మంది సేవారత్నలకు రూ.20 వేలు చొప్పున, మూడోస్థాయిలో 875 మంది సేవావజ్రలకు అసెంబ్లీ నుండి ఐదుగురి చొప్పున 175 నియోజకవర్గాల నుండి ఎంపిక చేసి వారికి రూ.30 వేలు చొప్పున నగదు ఇస్తామని తెలిపారు.



'వలంటీర్లకు వందనం' అవార్డుల కోసం రూ.239 కోట్ల 69 లక్షల చెక్కును విడుదల చేస్తున్న సిఎం జగన్



హైకోర్టు తాత్కాలిక సిజెగా జస్టిస్ ఎవి శేషసాయి

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ ప్రత్యేక కార్యదర్శి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటి వరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ పికె మిశ్రా పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. దీంతో కొత్త సిజె నియామకం జరిగే వరకు తాత్కాలిక సిజెగా హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా (నెంబర్ టూ) ఉన్న జస్టిస్ ఎవి శేషసాయి నియమితులయ్యారు. ప్రస్తుతం హైకోర్టులో 27 మంది న్యాయమూర్తులు ఉన్నారు.

ఎంత తేడా!



అటు

సమానత్వం, పరస్పర సహకారమే ధ్యేయంగా షాంగ్జీ ప్రావిన్స్‌లో శిఖరాగ్ర సమావేశానికి హాజరైన చైనా, సెంట్రల్ ఆసియా దేశాల అధినేతలు



ఇటు

రష్యాను దెబ్బతీయడమే లక్ష్యంగా హిరోషిమాలో భేటీ అయిన జి-7 దేశాల అధినేతలు. జి-7 వద్దు అంటూ వందలాది మంది నిరసనలు తెలిపారు. ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ అతిథి హోదాలో హాజరయ్యారు.

5

జూన్ 3 నుంచి గ్రూప్-1 మెయిన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 ప్రధాన పరీక్షలు జూన్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) కార్యదర్శి పరీక్ష షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జూన్ 3 నుంచి 10 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పది జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఈ నెల 24న హాల్ టిక్కెట్లను కమిషన్ వెబ్‌సైట్ psc.ap.gov.inలో పొందుపరుస్తామని పేర్కొన్నారు.

ముగిసిన ఇఎపిసెట్ ఎంపిసి పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఎపిసెట్) ఎంపిసి విభాగం పరీక్ష శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 15 నుంచి తొమ్మిది సెషన్స్‌లలో ఈ పరీక్ష జరిగింది. 2,38,180 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,24,724 (94.35 శాతం) మంది హాజరయ్యారని ఏపి ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో బైపిసి విభాగం అభ్యర్థులకు పరీక్ష జరగనుంది. ఈ విభాగంలో 99,557 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నాలుగు సెషన్స్‌లలో పరీక్షలు జరగనున్నాయి.

ఎస్‌సి గురుకుల ఉపాధ్యాయుల వేతనాలు పెంపు

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లోని 1,791 మంది పార్ట్‌టైమ్ టీచర్ల వేతనాలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున వెల్లడించారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీచర్లతో పాటుగా వ్యాయామ ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్ల వేతనాలను కూడా పెంచామని వెల్లడించారు. జూనియర్ లెక్చరర్ల వేతనాన్ని రూ.18 వేల నుంచి రూ.24,159కు, పిజిటిల వేతనాన్ని రూ.16,100 నుంచి రూ.24,150కు, టిజిటిల వేతనాన్ని రూ.14,880 నుంచి రూ.19,350కు పెంచామని వివరించారు. పిఇటిల వేతనం రూ.10,900 నుంచి రూ.16,350కు, హైల్త్ సూపర్ వైజర్, స్టాఫ్ నర్స్‌ల వేతనాన్ని రూ.12,900 నుంచి రూ.19,350కు పెంచామని తెలిపారు. 2019 తర్వాత పార్ట్‌టైమ్ టీచర్లు, ఇతర సిబ్బంది వేతనాలను పెంచడం ఇదే ప్రథమం అని పేర్కొన్నారు. వేతనాలను పెంచినందుకు గురుకుల విద్యాలయాల సంస్థ ఉద్యోగుల జెఎసి నేతలు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రపతి, లోక్‌సభ సభాపతి, ఆంధ్రరాష్ట్ర ఉపముఖ్యమంత్రి, కేంద్రమంత్రిగా పనిచేసిన నీలం సంజీవరెడ్డి నిస్వార్థ సేవలందించిన ప్రజా నాయకులు అని పిసిసి రాష్ట్ర కమిటీ పేర్కొంది. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం నీలం సంజీవరెడ్డి 110వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిసిసి లీగల్‌సెల్ ఛైర్మన్ వాలిబోయిన గురునాథం, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, ఎఐసిసి సభ్యులు మీసాల రాజేశ్వరరావు, ఆర్‌టిఐ ఛైర్మన్ వై కిరణ్, లీగల్‌సెల్ వైస్ ఛైర్మన్ జంధ్యాల శాస్త్రి, పొనుగుపాటి నాంచారయ్య, బూదాల జోసఫ్, మైనార్టీ నాయకులు షేక్ నాగూర్ పాల్గొన్నారు.

మండుటెండలో పని చేస్తున్నాం

- నిలువ నీడలేదు
- నీళ్లు, మజ్జిగ ఇవ్వడంలేదు
- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నేతల ఎదుట ఉపాధి కార్మికుల ఆవేదన

ప్రజాశక్తి-యంత్రాంగం

బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరగడంలేదు, పని ప్రదేశాల్లో కనీస వసతులు లేవు, నిబంధనల పేరుతో ఉపాధి పని దినాలను తగ్గించే కుట్రలు చేస్తున్నారంటూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నేతల ఎదుట ఉపాధి కార్మికులు వాపోయారు. మండుటెండలో పని చేస్తున్నాం, నిలువ నీడలేదు, పనిముట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు, మజ్జిగ ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం పలు జిల్లాల్లో పర్యటించారు. ఉపాధి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, చిలమత్తూరు, సోమందేపల్లి, రొద్దం తదితర మండలాల్లో నాయకులు పర్యటించి ఉపాధి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి కార్మికులు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కాసేపు సేద తీరేందుకు నీడ.. తాగేందుకు నీళ్లూ ఉండటం లేవని, ఎండ తీవ్రతతో అల్లాడుతున్నామని, కొందరు అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం రావిపాటి వారి పాలెంలో, పెదనందిపాడు మండలం రేటూరులో నేతల ఎదుట ఉపాధి కార్మికులు మాట్లాడుతూ వడగాల్పుల్లో ఉపాధి పనులు చేస్తున్నామని, మంచినీరు ఇవ్వడంలేదని, ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న నీళ్లు ఎండలకు వేడెక్కి పోతున్నాయని తెలిపారు. వేతనాల చెల్లింపు సకాలంలో జరగడం లేదని, సాంకేతిక కారణాలతో ఒక్కొక్క గ్రూపులో 10, 15 మందికి వేతనాలు ఆగిపోతున్నాయని తమ సమస్యలను నేతలకు విన్నవించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్లలో ఉపాధి కార్మికులు మాట్లాడుతూ పాములతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని, కనీసం ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా లేదని తెలిపారు.

నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనం

- కార్మిక - కర్షక ఐక్యతతోనే బలమైన ఉద్యమాలు
- పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతి సభలో పలువురి నేతల ఉద్ఘాటన

ప్రజాశక్తి - యంత్రాంగం



నెల్లూరులో సుందరయ్య చిత్రపటానికి పూలమాలేస్తున్న మూలం రమేష్, తదితరులు

రాజకీయాల్లో డబ్బు, వ్యాపారీకరణ చెందిన ప్రస్తుత పరిస్థితిల్లో రాజకీయ నాయకులంటే ఇలా ఉండాలని ఈ తరం ప్రజలకు, ప్రధానంగా యువతకు చాటి చెప్పేందుకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయమైన జీవితాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పలువురు నేతలు కోరారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభలను రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని సిపిఎం ప్రధాన కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జయరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదట పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు సిపిఎం సీనియర్ నాయకులు పి మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు వై కేశవరావు, తులసిరావు, రాష్ట్రకమిటీ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, కె ఉమామహేశ్వరరావు, కె ధనలక్ష్మి, అంద్ర మాల్యాద్రి, ఎం సూర్యారావు, కె స్వరూపరాణి, వై అచ్యుతరావు, జి రామన్న తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు ఎలా ఉండాలో చెప్పేందుకు సుందరయ్య జీవితం నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. కార్మిక- కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను కూలదోసి సోషలిజాన్ని నిర్మిస్తేనే మానవులకు విముక్తి లభిస్తుందని ఆయన బలంగా నమ్మారని తెలిపారు.

సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించేందుకు సమాయత్తం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మధు మాట్లాడుతూ.. పుచ్చలపల్లి సుందరయ్య బాల్యం నుండే దోపిడీ మీద పోరాటాన్ని ప్రారంభించారన్నారు. జగన్ ప్రభుత్వం విద్యుత్ మీటర్లు పెట్టి రైతులను నిలువు దోపిడీ చేస్తోందని, రైతాంగం మీద జరుగుతోన్న దాడిని సుందరయ్య స్ఫూర్తితో తిప్పికొట్టాలని కోరారు. వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించినా పేదలు, వ్యవసాయ కార్మికుల కోసం పనిచేశారని తెలిపారు. సుందరయ్య నిర్మించిన వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్తంగా విస్తరించి వ్యవసాయ కార్మికుల కోసం పనిచేస్తోందన్నారు. గన్నవరంలో రెడ్ వలంటీర్లు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని వి. శ్రీనివాసరావు ప్రారంభించారు.

కర్నూలు సుందరయ్య భవన్‌లో సుందరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుందరయ్యకు నివాళులర్పించడం వరకే పరిమితం కాకుండా ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడంతో పాటు సమాజ మార్పుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని సుందరయ్య భవనంలో పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పాల్గొని, మాట్లాడారు. సుందరయ్య నేర్పిన పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం తమ హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని కోరారు. మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించాలని చూస్తోందని విమర్శించారు.

నెల్లూరు జిల్లా కోవూరు మండలంలోని పడుగుపాడు రైల్వే గూడ్ షెడ్ లోడింగ్ అండ్ అన్ లోడింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంఘాలను, కార్మిక సంఘాలను నిర్మించి, ఉద్యమాలు నడిపిన పోరాట యోధులు, భూస్వామ్య కుటుంబంలో పుట్టినా నిరాడంబర జీవితాన్ని గడుపుతూ పార్లమెంటుకు సైతం సైకిల్ పై వెళ్లిన ఘన చరిత్ర సుందరయ్యది అన్నారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని యుటిఎఫ్ హోమ్‌లో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారామ్ పాల్గొని, మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని కొనియాడారు. తన జీవితాన్ని ప్రజా సమస్యలపై పేద బడుగు బలహీన వర్గాలకు సుందరయ్య అర్పించారని అన్నారు.

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ పాల్గొన్నారు. సుందరయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని కోరారు.

సిబిఐని భయపెడుతున్నారు టిడిపి నేత బోండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిబిఐని వైసిపి భయపెడుతోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వర రావు ఆరోపించారు. వివేకానందరెడ్డి కేసులో ఎంపి అవినాష్‌రెడ్డి దొరికిపోయినా ఇప్పటి వరకూ సిబిఐ అరెస్టు చేయలేకపోయిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తు బెయిల్ కోసం అవినాష్ రూ.వందల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. అవినాష్ అరెస్టులో సిబిఐ భంగపడుతోందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఇంతవరకు సిబిఐ జరిపిన విచారణపై కేంద్రం సమీక్షించాలని సూచించారు.

పేదల ద్రోహి జగన్ : ఎమ్మెల్సీ అనూరాధ

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ద్రోహి అని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ ఆరోపించారు. అన్నా క్యాంటిన్‌లు, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, చంద్రన్న బీమా వంటి సంక్షేమ పథకాలను రద్దు చేస్తే పేదల పెన్నిధి ఎలా అవుతారని విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. ఏ ఇతర పథకం వస్తున్నా.. వృద్ధాప్య పెన్షన్ రద్దయ్యేలా జగన్ ప్రభుత్వం చేసిందని అన్నారు.

వైసిపి దళిత వ్యతిరేక విధానాలపై ప్రచారం

వైసిపి ప్రభుత్వం అనుసరించిన దళిత వ్యతిరేక విధానాలపై ప్రతి దళితవాడలో 'దళితతేజం - తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహిస్తామని టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్, దొప్పలపూడి జ్యోతిబసు, దయారత్నం, ప్రధాన కార్యదర్శి మేకల దాసు పాల్గొన్నారు.

రివర్స్ గేర్‌లో పాలన

- అనకాపల్లి సభలో చంద్రబాబు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి/ శృంగవరపుకోట



అనకాపల్లిలో రోడ్‌షోలో చంద్రబాబు నాయుడు

జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి రివర్స్‌గేర్‌లో ఉందని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. అప్పులు, నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీల పెంపులోనూ, నెలవారీ జీతాలు ఇవ్వలేకపోవడంలోనూ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని వ్యాఖ్యానించారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం అనకాపల్లిలోని నెహ్రూచౌక్ వద్ద రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన వారు జగన్‌కు భయపడి వెనక్కు వెళ్లిపోయారని విమర్శించారు. పెట్టుబడులు రావడంలో నెంబర్ వన్ స్థానంలో ఉన్న రాష్ట్రం నేడు 14వ స్థానంలో ఉందని దుయ్యబట్టారు. ఐటి ఎగుమతుల్లో రాష్ట్రం వెనుకబడిందన్నారు. తమ ప్రభుత్వంలో నిర్మించిన 52 వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వలేదని తెలిపారు. పేదలపై జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంపై జగన్‌కు ఉన్నది ప్రేమకాదని, ఇక్కడున్న భూములు, ఆస్తుల కోసమే రాజధాని పేరుతో మూడు ముక్కలాట ఆడుతున్నాడని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో శిరికి గ్రీన్ సిటీలో దాసరి సామాజిక తరగతితో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలోని 134 బిసి కులాలు ఉంటే వారికి గుర్తింపు తెచ్చిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అని అన్నారు. తన నాయకత్వంలో 34 శాతానికి రిజర్వేషన్లు పెంచి బిసిలకు అన్ని కార్పొరేషన్లు, పంచాయతీల్లో అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. దాసరి సామాజిక తరగతి వారు విద్యలో వెనుకబడ్డారన్నారు. రానున్న రోజుల్లో వీరి సంక్షేమానికి పాటుపడతానని తెలిపారు. సిఎం జగన్ పోలవరాన్ని గోదావరిలో ముంచేశారు, పతంజలిని పారిపోయేలా చేశారని విమర్శించారు. గిరిజన యూనివర్సిటీని తరలించారని దుయ్యబట్టారు. జగన్ పాలనలో అనేక పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని, పెట్టుబడులు పెట్టేందుకు యజమానులు భయపడి పోతున్నారని అన్నారు. అమరావతిని మూడు ముక్కలాటతో నాశనం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో సిఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్‌లో పేదలకు 5 శాతం భూములు కేటాయించినప్పుడు పేదల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని, రాజధానేతరులకు ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో రెండు గ్రూపుల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రజలంతా చైతన్యవంతులు కావాలని, ప్రభుత్వ తీరుపై చర్చ జరగాలని సూచించారు.

మీడియాపై దాడి హేయమైన చర్య

వైసిపి ఎంపి అనుచరులు మీడియా ప్రతినిధులపై దాడి చేసి గాయపరచడం, మీడియా వాహనాలను ధ్వంసం చేయడం హేయమైన చర్య అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధినిర్వహణలో ఉన్న మీడియా సిబ్బందిపై దాడిని ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛను సిఎం జగన్ హరిస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

సుందరయ్య స్ఫూర్తితో విద్యారంగ పరిరక్షణ

- స్మారకోపన్యాసంలో లక్ష్మణరావు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

సుందరయ్య స్ఫూర్తితో విద్యా రంగ పరిరక్షణకు అందరూ పాటుపడాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు కోరారు. 'చరిత్ర, సైన్స్‌కు స్థానంలేని జాతీయ విద్యా విధానం ప్రయాణం ఎటు' అనే అంశంపై కర్నూలు నగరం టౌన్ మోడల్ పాఠశాలలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు అధ్యక్షతన స్మారకోపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. మతతత్వాన్ని పెంచి పోషించడంలో భాగంగా డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, మౌలానా అబుల్ కలాం ఆజాద్ గురించి, జమ్మూ కాశ్మీర్ విలీనం, గాంధీ హత్య, ఆర్‌ఎస్ఎస్ నిషేధం పాఠాలను కూడా తొలగించారని తెలిపారు. చరిత్ర మీద కేంద్రం పెద్ద ఎత్తున దాడి చేస్తోందని, ముస్లిములు ఈ దేశం వాళ్లు కాదని చెప్పడానికి మొఘలుల చరిత్రను తొలగించేశారని పేర్కొన్నారు. మతతత్వ ధోరణి కోసమే విద్యా కేంద్రీకరణ, విద్యా వ్యాపారీకరణ, విద్యా రంగంలో జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ విధానాన్ని బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయకుండానే మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారని, చాలా పాఠశాలలను మూసి వేశారని తెలిపారు. ఎన్‌ఇపిని అందరూ వ్యతిరేకించాలని కోరారు. రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన జరగాలంటే సుందరయ్య లాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభ అనంతరం కర్నూలు కార్పొరేషన్ పరిధిలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సుందరయ్యస్ఫూర్తి కేంద్రం ఛైర్మన్ కె.ప్రభాకర్ రెడ్డి, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్.శేషయ్య, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.జయరాజు పాల్గొన్నారు.

నీళ్లసంపు శుభ్రం చేస్తుండగా... ముగ్గురిని బలిగొన్న విషవాయువు

- రూ.25 లక్షలివ్వాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - పుంగనూరు (చిత్తూరు జిల్లా)



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

నీళ్లతొట్టెను శుభ్రం చేస్తుండగా విషవాయువుతో ఊపిరాడక ముగ్గురు మరణించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... పెద్దకొండామర్రి గ్రామంలో వచ్చే వారం జరగనున్న గంగమ్మజాతరకు అవసరమైన మంచినీటిని నిల్వ చేసుకునేందుకు గ్రామంలో నూతనంగా నిర్మించిన సంపు శుభ్రం చేసుకోవాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన రమణ (30), మునిరాజా (27), రవి (37) సంపులోకి దిగారు. నాగభూషణ్‌రెడ్డి సంపు పైన ఉండగా, రవి, మునిరాజా, రమణ లోపలికి దిగారు. అయితే సంపులోపల విషవాయువు పీల్చడంతో ఊపిరాడక ముగ్గురూ అక్కడికక్కడే మరణించారు. సంపులోపలికి దిగిన వారు ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో గ్రామస్తుల సహాయంతో ముగ్గురిని బయటకు తీశారు. ఈ క్రమంలో నాగభూషణ్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబాలను మంత్రి పెద్దిరెడ్డి పరామర్శించారు. పరిహారం కింద మృతుల కుటుంబాలకు రూ. ఐదు లక్షలు, వైఎస్ఆర్ బీమా పథకం కింద మరో రూ. ఐదు లక్షలు అందిస్తామని ప్రకటించారు. మృతులంతా వ్యవసాయ కూలీలని, వీరి మృతితో వారి కుటుంబాలు వీధినపడ్డాయని రూ. 25 లక్షలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు.

మీడియాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మీడియా రిపోర్టర్లు, వారి వాహనాలపై కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి అనుచరులు దాడులు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపి అవినాష్‌రెడ్డి హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరుకాకుండా తిరిగి వెళ్తున్న సందర్భంలో వారిని అనుసరిస్తున్న టివి ఛానెల్ వాహనంపై ఆయన అనుచరులు రాళ్లతో దాడి చేసి విలేకరిని గాయపరిచినట్లు వార్తలు వచ్చాయని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛను హరించేలా అధికార పార్టీ అనుచరులు దాడులకు పాల్పడటం అప్రజాస్వామికమని, అది అరాచకానికి దారి తీస్తుందని తెలిపారు. మీడియా స్వేచ్ఛను హరించే చర్యలకు సిపిఎం వ్యతిరేకమని, దాడికి పాల్పడిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

ప్రజాస్వామిక వ్యవస్థలో భౌతిక దాడులు మంచివి కావు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాస్వామిక వ్యవస్థలో భౌతిక దాడులు మంచివి కావని, మీడియా ప్రతినిధులపై ఎంపి అవినాష్‌రెడ్డి అనుచరులు దాడి చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఖండించారు. ఎబిఎన్ ఆంధ్రజ్యోతి వాహనాన్ని ధ్వంసం చేయడంతోపాటు రిపోర్టరు, కెమెరామెన్‌పై దాడి చేసి కొట్టడం దుర్మార్గమన్నారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

దాడి అప్రజాస్వామికం : పవన్‌కల్యాణ్

ఎంపి అవినాష్‌రెడ్డి వాహనాన్ని అనుసరిస్తున్న మీడియా సిబ్బందిపై వైసిపి గూండాలు దాడికి పాల్పడటం అప్రజాస్వామికమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎబిఎన్, ఆంధ్రజ్యోతి, హెచ్ఎం టివిలకు సంబంధించిన విలేకరులు, ఇతర సిబ్బందిని గాయపరిచి, వాహనాలను, కెమెరాలను ధ్వంసం చేయడం చూస్తుంటే వైసిపి గూండాల బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు.

తక్షణమే అరెస్టు చేయాలి : సోము వీర్రాజు

ఎంపి కాన్వాయ్‌ను అనుసరిస్తున్న మీడియా సిబ్బంది, రిపోర్టర్‌పై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియాపై దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మీడియా ప్రతినిధులపై దాడి దుర్మార్గం : ఐజెయు

విధి నిర్వహణలో భాగంగా సమాచార సేకరణకు వెళ్లిన పాత్రికేయులపై ఎంపి అవినాష్‌రెడ్డి అనుచరులు చేసిన పాశవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఎపియుడబ్ల్యుజె) ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి రాంబాబు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, చందు జనార్ధన్, ఎపిఇఎంజెఎ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివ యేచూరి, మురళీమోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు.

37 మంది ఎఎస్‌పిల బదిలీ

- 18 మందికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

37 మంది అడిషనల్ ఎస్‌పిలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 18 మంది డిఎస్‌పిలకు ఉద్యోగోన్నతులతోపాటు కొత్తగా పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు ట్రాఫిక్ డిఎస్‌పి జె తిప్పేస్వామికి ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళం అడిషనల్ ఎస్‌పిగా పోస్టింగు ఇచ్చారు. ఎస్ఐబి డిఎస్‌పి ఎన్ విష్ణును ఉద్యోగోన్నతిపై సత్యసాయి ఎఎస్‌పిగా, అనంతపురం ఎఎస్‌పి ఈ నాగేంద్రుడును విశాఖపట్నం ఎస్‌బి అడిషనల్ డిసిపిగా, గుంటూరు ఎఎస్‌పి పి అనిల్‌కుమార్‌ను ఎసిబి ఎఎస్‌పిగా, వెయిటింగ్‌లో వున్న డిఎస్‌పిలు జి ప్రేమ్ కాజల్‌ను కాకినాడ ఎస్ఐబికి, ఎస్ ఖాదర్‌బాషాను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ ఎఎస్‌పిగా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎఎస్‌పి కె లతా మాధురిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. కడప ఎఎస్‌పి ఎన్ పూజితను కర్నూలుకు, వెయిటింగ్‌లో వున్న మహేంద్ర మాథేను ఎసిబి ప్రధాన కార్యాలయానికి, తూర్పు గోదావరి సిసిఎస్ డిఎస్‌పి ఎంజెవి భాస్కరరావును ఏలూరు ఎఎస్‌పిగా, విజయవాడ సిటిలో సిటిఎఫ్ ఎఎస్‌పి జివి రమణమూర్తిని విజయవాడ టాస్క్‌ఫోర్స్ డిసిపిగా, వెయిటింగ్‌లో వున్న డిఎస్‌పి షేక్ మాసుంబాషాను కడపకు, కృష్ణా ఎఎస్‌పి ఎన్ వెంకటరామాంజనేయులును గవర్నరుకు ఎడిసిగా, గవర్నరు ఎడిసిగా ఉన్న కె ఈశ్వరరావును గుంటూరుకు, విజయవాడ ట్రాఫిక్ ఎడిసిపి టి శంకర్‌ను కర్నూలు ఎఎస్‌పిగా, డిఎస్‌పి ఆర్ శ్రీహరిబాబును కృష్ణా ఎఎస్‌పిగా, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి ఆర్ రాఘవేంద్రను పల్నాడు ఎఎస్‌పిగా, సిఐడి ఎస్‌పి కెజివి సరితను ఇంటెలిజెన్స్ ఎస్‌పిగా, కడప నుంచి బి ఉమామహేశ్వరరావును సిఐడి ఎస్‌పిగా, కర్నూలు ఎఎస్‌పి డి ప్రసాద్‌ను విజయవాడ ట్రాఫిక్ ఎఎస్‌పిగా, జి వెంకటరాముడును డిఎస్‌పి ఇంటెలిజెన్స్ నుంచి ఉద్యోగోన్నతిపై నంద్యాల ఎఎస్‌పిగా, ప్రకాశం డిటిసి డిఎస్‌పి జి రామకృష్ణను అనంతపురం ఎస్ఐబి ఎఎస్‌పిగా, నెల్లూరు ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి వైబిపిటిఎ ప్రసాద్‌ను చిత్తూరు ట్రాన్స్‌పోర్టు ఎఎస్‌పిగా, తిరుపతి సిసిఎస్ డిఎస్‌పి సిహెచ్ సురేష్‌ను ఉద్యోగోన్నతిపై సిఐడి ఎఎస్‌పిగా, నంద్యాల ఎఎస్‌పి ఆర్ రమణను విజయవాడ అడిషనల్ డిసిపిగా, అనకాపల్లి డిపిటిసి డిఎస్‌పి కె ప్రవీణ్‌కుమార్‌ను కడప ఎస్ఐబి ఎఎస్‌పిగా, సత్యసాయి ఎఎస్‌పి కెఆర్ ప్రసాద్‌ను విజయవాడ ఎస్ఐబి ఎఎస్‌పిగా, తూర్పు గోదావరి ఎఎస్‌పి పిహెచ్ పాపారావును సిఐడి ఎఎస్‌పిగా, వెయిటింగ్‌లో వున్న డిఎస్‌పి ఎస్‌కె చంద్రశేఖర్‌ను పల్నాడు క్రైమ్ ఎఎస్‌పిగా, విజయవాడ ఎసిపి ఎస్ఆర్ రాజశేఖర్‌రాజును తూర్పుగోదావరి ఎఎస్‌పిగా, వెయిటింగ్‌లో వున్న డిఎస్‌పి ఆర్ విజయభాస్కర్‌రెడ్డిని అనంతపురం ఎఎస్‌పిగా, శ్రీకాకుళం డిటిసి డిఎస్‌పి జి శ్రీనివాసరావును విశాఖ ట్రాఫిక్ అడిషనల్ డిసిపిగా, తిరుమల సిసిఎస్ డిఎస్‌పి ఎల్ సుధాకర్‌ను చిత్తూరు ఎఎస్‌పిగా, వెయిటింగ్‌లో వున్న డి సూర్యశ్రావణ్‌ను గ్రే హౌండ్స్‌కు ఎఎస్‌పిగా వేశారు. కృష్ణా ఎస్ఐబి ఎఎస్‌పి ఆస్మా ఫర్హీన్‌ను విజయనగరం ఎస్ఐబి ఎఎస్‌పిగా, సిఐడి ఎఎస్‌పి ఎం స్నేహితను విజయవాడ ఎసిబి ఎఎస్‌పిగా బదిలీ చేశారు.

బికాం హ్యూమానిటీస్ విభాగమే : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

బికాం కోర్సు ఆర్ట్స్, హ్యూమానిటీస్ విభాగం కిందకే వస్తుందని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఇదే కేటగిరి కింద అన్ని యూనివర్సిటీలు విద్యాబోధన చేస్తున్నాయని స్పష్టం చేసింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) సమాచార హక్కు చట్టం కింద తెలిపిన వివరాల ప్రకారం కూడా ఆదే విభాగమని చెప్పింది. బికాం చేసిన వారు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ (గ్రేడ్-2) పోస్టుకు అనర్హులన్న వాదనను కొట్టేసింది. నోటిఫికేషన్‌లో వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ పదవి నిర్వహించేవాళ్ల విధులు, బాధ్యతల గురించి నోటిఫికేషన్‌లో పేర్కొనలేదని గుర్తు చేసింది. ఆర్ట్స్ నేపథ్యం ఉన్న వాళ్లే ఆ విధులు, బాధ్యతలను నిర్వర్తిస్తారని పేర్కొనలేదంది. బికాం చేసిన వాళ్లు ఆ పోస్టులకు అర్హులంటూ జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్‌తో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. రాతపరీక్షలో ఉత్తీర్ణత పొంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో అనర్హులుగా అధికారులు పరిగణించడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను అనుమతించింది. పిటిషనర్లు సంబంధిత పోస్టుకు అర్హత సాధించి ఉంటే వారిని సదరు పోస్టుల్లో నియమించాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను 8 వారాల్లో పూర్తి చేయాలని మున్సిపల్‌శాఖను ఆదేశించింది.

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంపై రిట్ డిస్మిస్

తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయ గర్భగుడి విమాన గోపురంపై బంగారు పూతతో కూడిన రాగి రేకులను ఏర్పాటు చేసే పనుల్లో అక్రమాలు జరిగాయని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ నెల 21న జరిపే ఆలయ మహాసంప్రోక్షణ పనులు నిలిపివేత ఉత్తర్వుల జారీకి కూడా నిరాకరించింది. బంగారు పూతతో కూడిన రాగి రేకు ఏర్పాటు పనుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలను నివేదించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని గుర్తు చేసింది. మహా సంప్రోక్షణ కార్యక్రమం వాయిదాకు ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. పనులు పూర్తయిన తర్వాత కూడా వాటి తీరును డ్రోన్ల ద్వారా పరిశీలించేందుకు ఆస్కారం ఉందని స్పష్టం చేసింది.

తాగునీటి లెక్కను తేల్చండి

- 20 శాతం లెక్కించాలి : కర్ణాటక
- కేంద్రానికి లేఖ రాస్తాం : తుంగభద్ర బోర్డు
- 40 ఏళ్లుగా లేనిది ఇప్పుడెందుకు? : ఏపి
- ఆర్‌డిఎస్ ఆధునీకరణ చేపట్టాలి : తెలంగాణ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాగునీటి అవసరాల కోసం తీసుకునే నీటిని 20 శాతం మాత్రమే లెక్కించాలని కర్ణాటక విజ్ఞప్తి చేసింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తాగునీటికి 10 టిఎంసిల నీటిని తీసుకుంటే, ఆ నీటిలో ఎనిమిది టిఎంసిల రిటర్న్ ఫ్లో ఉంటుందనీ, ఈ నేపథ్యంలో 20 శాతం మాత్రమే లెక్కలోకి తీసుకోవాలని కర్ణాటక గట్టివాదనను వినిపించింది. తుంగభద్ర నదీ యాజమాన్య బోర్డు (టిఆర్‌ఎంబి) సమావేశం ఛైర్మన్ డిఎం రాయ్‌పురే అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఎపి ఇఎన్‌సి సి.నారాయణరెడ్డి , కర్ణాటక జలవనరుల శాఖ ఇఎన్‌సితోపాటు తెలంగాణ ఇఎన్‌సి సి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. తాగునీటి అవసరాలకు 20 శాతం లెక్కించాలనే అంశంపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. 40 ఏళ్లుగా లేనిది, ఇప్పుడు లేవనెత్తడం ఎందుకని ప్రశ్నించింది. బచావత్ ట్రిబ్యునల్ అమల్లోకి వచ్చినప్పటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరని, నీటి అవసరాలు పెరిగాయని అందువల్లే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నామని కర్ణాటక అభిప్రాయం వ్యక్తం చేసింది. 20 శాతం మాత్రమే లెక్కించాలంటే రిటర్న్ ఫ్లో కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందనీ, ఆ ఏర్పాట్లు లేకుండా 20 శాతం వాదనకు అర్థం లేదని ఏపీ సైతం తన అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాల వాదలను విన్న టిఆర్‌ఎంబి ఛైర్మన్ రాయ్‌పురే మాట్లాడుతూ.. కృష్ణా బోర్డు సమావేశంలోనూ ఈ అంశాన్ని తెలంగాణ ప్రస్తావించిందనీ, తుంగభద్ర బోర్డు సమావేశంలో కర్ణాటక లేవనెత్తిన అంశాలతోపాటు కృష్ణాబోర్డు సమావేశంలో తెలంగాణ లేవనెత్తిన అంశంపై తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర నీటి వనరుల శాఖకు లేఖ రాయనున్నట్టు తెలిపారు. ఇక ఆర్‌డిఎస్ ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలనీ, వాటా మేరకు నీరు తెలంగాణకు రావడం లేదని తెలంగాణ ఇఎన్‌సి సి.మురళీధర్ బోర్డు దృష్టికి తెచ్చారు. దీనిపై తుంగభద్ర బోర్డు ఛైర్మన్ రాయ్‌పురే స్పందిస్తూ.. ఆర్‌డిఎస్ ఆధునీకరణకు ముందు, కేంద్రం నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సిడబ్ల్యూపిఆర్‌ఎస్)తో అధ్యయనం చేయించాలంటూ కృష్ణాబోర్డులో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆ అధ్యయనం అనంతరం నివేదిక అందిన తర్వాతే ఆధునీకరణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిఆర్‌ఎంబి బడ్జెట్ పై చర్చ జరిగింది.

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేయాలి

- సిఎం జగన్‌కు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేయాలని, కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, టైమ్ స్కేల్ వర్తింపజేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, బి ముత్యాలరావు లేఖ రాశారు. సమాన పనికి సమాన వేతనం, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్టర్, అన్‌స్కిల్డ్ వేతనాలు, కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. క్లాప్ ఆటోడ్రైవర్లకు నెలకు రూ.18,500 జీతం చెల్లించాలని, పట్టణ విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని, రక్షణ, భద్రతా సౌకర్యాలు పనిముట్లు సకాలంలో అందించాలని విజ్ఞప్తి చేశారు. మస్టర్ పాయింట్లు, వార్డు కార్యాలయాల వద్ద మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని కోరారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్, రాయచోటి టౌన్

రాష్ట్రంలో పిడుగుపాటుకు ఇద్దరు మరణించారు. స్థానికులు సమాచారం మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలంలోని పెద్ద బొండపల్లి గ్రామానికి చెందిన వంగపండు తాతబాబు(46) పశువుల కాపరిగా జీవిస్తున్నారు. తన పొలంలో పశువులను మేపుతున్న సమయంలో ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. రక్షణ కోసం పొలంలో ఉన్న బావి దగ్గరికి వెళ్లారు. అతనికి సమీపంలో పిడుగు పడటంతో పక్కనే ఉన్న నూతిలో పడిపోయారు. గ్రామస్తులు గమనించి అతన్ని బావిలో నుంచి బయటకు తీయగా అప్పటికే చనిపోయారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండల పరిధిలోని దుద్యాల గ్రామానికి చెందిన పల్లెల గంగిరెడ్డి(55) తన పొలం లో ఆవులు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకి వెళ్తున్న సమయంలో పిడుగుపడటంతో అక్కడికక్కడే మరణించాడు.

అన్ని వసతులతో ఆర్5 జోన్‌లో పేదలకు ఇళ్లు

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



రాజధానిలో ఆర్5 జోన్‌లో లే అవుట్లు పరిశీలిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ ఓ యజ్ఞంలా కొనసాగుతోందని, అన్ని వసతులతో ప్రయివేటు టౌన్‌షిప్‌లకు మించి ఆర్-5 జోన్‌లో ఇళ్లు నిర్మించుకోవడానికి అనుకూలంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. అమరావతి రాజధానిలోని నవులూరు, కృష్ణాయపాలెం గ్రామాల్లో పేదలకు పంపిణీ చేయనున్న ఇళ్ల స్థలాల లేఅవుట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షలకుపైగా ఇళ్ల స్థలాల కేటాయించామని, టిడ్కో గృహాలలో సౌకర్యాలను పూర్తి చేసి పేదలకు అందించినట్లు తెలిపారు. రాజధానిలో పేదలకు ఇళ్లు ఇస్తుంటే చంద్రబాబుకు ఎందుకు కడుపు మంట అని ప్రశ్నించారు. రాజధాని రైతుల ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు, ఏజెంట్లు విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సెంటు భూమి కేటాయింపుపై విమర్శలు చేయడం తగదన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలో పేదలకు కనీసం సెంటి భూమి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. పేదలు, దళితులు, వెనుకబడిన తరగతులు రాకూడదని కడుపు మంట చంద్రబాబు మాటల్లో కనిపిస్తోందన్నారు. లేఅవుట్లు ప్రణాళిక బద్ధంగా జరుగుతున్నాయని, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. లేఅవుట్లను పరిశీలించిన వారిలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎంపి నందిగం సురేష్, జిల్లా వైసిపి అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జడ్‌పి ఛైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ దరఖాస్తులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 162 మోడల్ స్కూల్స్‌లో 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 22 నుంచి జూన్ 7 వరకు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలోనే బోధన జరుగుతుందని పేర్కొన్నారు. apms.apcfss.in// cse.ap.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరిచామని, దరఖాస్తు చేసేముందు అభ్యర్థులు వీటిని చూడాలన్నారు. నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి దరఖాస్తు రుసుం చెల్లించాలని వివరించారు. అనంతరం apms.apcfss.in// cse.ap.gov.in వెబ్‌సైట్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. ఒసి, బిసి, ఇడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.200, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.150 చెల్లించాలని వివరించారు. పదో తరగతి మార్కుల ఆధారంగా నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్స్‌ను గానీ, సంబంధిత జిల్లా విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులను గానీ సంప్రదించాలని వివరించారు.

అఖిలప్రియకు అస్వస్థత

- ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న టిడిపి నేత, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. జైలు అధికారులు గుర్తించి వెంటనే ఆమెను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అఖిలప్రియకు డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించారు. మెడికల్ రిపోర్టు కోసం జైలు అధికారులు వేచిచూస్తున్నారు. ఎవి సుబ్బారెడ్డిపై దాడి కేసులో భూమా అఖిలప్రియకు కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు

- అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు
- వివిధ రంగాలవారితో లోకేష్ ముఖాముఖి



నంద్యాల జిల్లా రాయపాడులో మాట్లాడుతున్న నారాలోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం కర్నూలు జిల్లా నంద్యా నియోజకవర్గం రాయపాడు విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. నంద్యాల, బనగానపల్లె నియోజకవర్గాల్లో కైప వరకూ సాగింది. పాదయాత్రకు ముందు విడిది కేంద్రం వద్ద వివిధ రంగాల తటస్తులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసి టిడ్కో తరహాలో ఇళ్లు ఇస్తామన్నారు. న్యాయ వ్యవస్థకు అధిక నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తామని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగుల కోసం క్రమం తప్పకుంగా డిఎస్‌సి నిర్వహిస్తామని, పెండింగ్ పోస్టులను భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని తెలిపారు. మహిళలకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, మీసేవను పటిష్ట పరుస్తామని, పన్నులను ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో టిడిపి నంద్యాల నియోజకవర్గ ఇంఛార్జి భూమా బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. టిడిపి బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిసి జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ యాత్రలో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

నాటుసారా, అక్రమ మద్యం పూర్తిగా నిర్మూలించాలి : ఎస్ఇబి కమిషనర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నాటుసారా, అక్రమ మద్యం రవాణాను పూర్తిగా నిర్మూలించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) కమిషనరు ఎమ్ రవిప్రకాష్ ఆదేశించారు. శుక్రవారం మంగళగిరిలోని ఎస్ఇబి కార్యాలయంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల ఎస్ఇబి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు ఎం రవిప్రకాష్ మాట్లాడుతూ.. నాటుసారా, అక్రమ మద్యం, గంజాయిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసుల్లో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు ఫైల్ చేయాలని ఆదేశించారు. నాటుసారాను పూర్తిగా నిర్మూలించిన గ్రామాల్లో మళ్లీ సారా తయారీ చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఇండస్ట్రియల్ ఆల్కహాల్ వినియోగిస్తున్న పరిశ్రమలను సైతం నిరంతరం తనిఖీలు చేసి యజమానులకు తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. నాటుసారా తయారీ, గంజాయి సాగు వంటి నేరాలకు పాల్పడుతున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల వద్ద ప్రత్యేక నిఘా పెంచాలన్నారు.

విఆర్‌ఒలకు బదిలీ అవకాశం కల్పించాలి

- సిసిఎల్‌ఎకు విఆర్‌ఒల సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాధారణ బదిలీల్లో భాగంగా విఆర్‌ఒలకూ బదిలీలు కల్పించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మిర్యాల లక్ష్మీనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయంలో సిసిఎల్ఎ సాయిప్రసాద్, అడిషనల్ జాయింట్ సెక్రటరీ ఇంతియాజ్‌కు విఆర్‌ఒల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రేడ్-2 విఆర్‌ఒల ప్రొబేషన్ విషయంలో ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క విధంగా ప్రొబేషన్ డిక్లెర్ చేయడంతో సర్వీస్ పరంగా ఎదురయ్యే ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. సర్వే పరీక్షల్లో ఫెయిలైన వారికి కూడా వెంటనే సప్లిమెంటరీ సర్వే పరీక్షలు నిర్వహించి ప్రొబేషన్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంఘం నేతలు కోరారు.

అనంతరం సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్సు కమిషనరు సిద్దార్ధజైన్‌ను కలిసి సర్వే సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గ్రేడ్-1, గ్రేడ్-2 విఆర్‌ఒలకు ఉమ్మడి డిడిఒగా తహశీల్దారు ఉండేలా ప్రభుత్వం నుంచి వచ్చిన ఫైల్ విషయంపై మాట్లాడుతూ.. తక్షణమే కామన్ డిడిఒగా తహశీల్దారు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

నిరంతరం నాణ్యమైన విద్యుత్

- డిమాండ్ తగినట్లుగా సరఫరా : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ కూడా పగటిపూట 9 గంటలు అందిస్తామన్నారు. విద్యుత్‌శాఖ అధికారులతో శుక్రవారం ఆయన వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఉచిత విద్యుత్ పథకాన్ని బలోపేతం చేసేందుకు 2023 మార్చి నాటికి 1.20 లక్షల వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఈ నెల 18న అత్యధికంగా రోజువారీ డిమాండ్ 251 మిలియన్ యూనిట్ల (ఎంయు)కు చేరుకుందన్నారు. విద్యుత్ డిమాండ్ పెరగడం రాష్ట్రంలో ఆర్థిక ప్రగతికి చిహ్నమన్నారు. 2018-19లో విశాఖ సిటీలో 6,696 ఎంయుల ఉన్న డిమాండ్ 22 శాతానికి పెరిగి 8,164 ఎంయులకు చేరుకుందన్నారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మాట్లాడుతూ.. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో థర్మల్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా పెంచాలని కేంద్ర బొగ్గు, రైల్వేశాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధరబాబు మాట్లాడుతూ.. ఈ నెల 18న ఉన్న 251 ఎంయుల డిమాండ్‌లో ఎక్కువ భాగం జెన్‌కో అందించిందని తెలిపారు. 103.294 ఎంయుల విద్యుత్‌ను అందించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఐ పృథ్వీతేజ్, సిపిడిసిఎల్ సిఎమ్‌డి జె పద్మ జనార్ధన్‌రెడ్డి, ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి కె సంతోషరావు పాల్గొన్నారు.

మెటాలో మళ్లీ 6,000 మందిపై వేటు



న్యూయార్క్ : ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్స్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా మరోసారి వేలాది మంది ఉద్యోగుల తొలగింపునకు పాల్పడింది. వచ్చే వారం నుంచి 6000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ ఏడాది మేలో తదుపరి దశ ఉద్వాసనలు ఉంటాయని మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో.. ఆ దిశగా నిర్ణయం తీసుకుందని రిపోర్టులు వస్తున్నాయి. పొదుపు చర్యల్లో భాగంగా గతేడాది నవంబర్‌లో 11,000 మంది ఉద్యోగులను మెటా తొలగించింది. మరో 10,000 మంది ఉద్యోగులపై వేటు వేస్తున్నట్లు ఈ ఏడాది మార్చిలోనే ప్రకటించింది. మూడో దఫా తొలగింపు ప్రక్రియ వచ్చే వారం నుంచే ప్రారంభమవుతాయని తెలిపింది.

కేంద్రానికి రూ.87,416 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌బిఐ భారీ డివిడెండ్‌ను ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్‌బిఐ వద్ద ఉన్న మిగులు నిధుల నుంచి రూ.87,416 కోట్లు కేంద్రానికి బదిలీ చేయడానికి ఆర్‌బిఐ బోర్డు శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇంతక్రితం 2021-22లో రూ.30,307 కోట్ల డివిడెండ్‌ను అందించింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ నుంచి బిజెపి ప్రభుత్వం భారీ డివిడెండ్‌ను ఆశించింది. ఆ విధంగానే ఆర్‌బిఐ కేటాయించిందని నిపుణులు భావిస్తున్నారు.

పిఎన్‌బి ఫలితాలు అదుర్స్

ఐదు రెట్లయిన లాభాలు

ముంబయి : ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఏకంగా 474 శాతం వృద్ధితో రూ.1,158.61 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.201.57 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.21,095 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. క్రితం త్రైమాసికంలో రూ.27,269 కోట్లకు చేరింది. 2022 మార్చి నాటికి 11.78 శాతంగా ఉన్న బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు.. ప్రస్తుత ఏడాది మార్చి ముగింపు నాటికి 8.74 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 4.8 శాతం నుంచి 2.72 శాతానికి పరిమితమయ్యాయి.



రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థుల మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగర శివారులో ఘోర రోడ్డు ప్రమాదం శుక్రవారం చోటుచేసుకుంది. రంగారెడ్డి నార్సింగి శివారులో ఆర్‌టిసి బస్సును ఓవర్‌టెక్ చేయబోయి ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై నార్సింగి డిసిపి మీడియాకు వివరించారు. నిజాంపేట ప్రాంతానికి చెందిన 12 మంది విద్యార్థులు శంకర్‌పల్లి నుంచి గండిపేట వైపు ఉసెన్ పార్క్ వెళ్తున్నారు. నార్సింగి వద్దకు రాగానే ఆర్‌టిసి బస్సును ఓవర్‌టెక్ చేస్తూ ముందు ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అంకిత (17), నితిన్ (20), అమృత్ (18) ఆర్షిత (18) మృతి చెందారు. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు సీట్లో కూర్చున్న ప్రసాద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.. ఈ ప్రమాదానికి అతివేగం, అజాగ్రత్తతో కారును నడపడటమేనని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలిపారు. మృతులంతా నిజాంపేట ప్రాంతానికి చెందిన వారని గుర్తించినట్టు చెప్పారు. పూర్తి సమాచారం సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీసీపీ తెలిపారు.

సంపాదకీయం


మండుతున్న భూగోళం

భారత్‌తో సహా భూగోళమంతటా ఎండలు దంచికొడుతున్నాయి. జనం పిట్టల్లా రాలిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు తగ్గడం లేదు. రాబోయే దశాబ్ద కాలంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందంటూ ఇటీవల ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) ఉష్ణోగ్రత ధోరణుల నివేదికలో హెచ్చరించింది. పారిశ్రామిక విప్లవ ఫలితాలను తొలుత అందుకున్న అమెరికా, ఇంగ్లండ్ వంటి పశ్చిమ దేశాలు వాతావరణంలోకి విచ్చలవిడిగా కర్బన ఉద్గారాలు వెదజల్లడమే భూతాపానికి ప్రధాన కారణం. ప్రపంచ పర్యావరణ శిఖరాగ్ర సదస్సుల్లో భూ ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల వద్దే నిలువరించాలని నెత్తినోరూ బాదుకుంటున్నా.. భూతాపానికి కారణమై తెగ బలిసిన దేశాలు ప్రధానంగా అమెరికా నిస్సిగ్గుగా బాధ్యతను విస్మరించి పర్యావరణ సదస్సుల నుంచే పారిపోతోంది. వర్ధమాన, పేద దేశాలు తాము మూల్యం చెల్లించలేమంటూ నిస్సహాయత ప్రకటిస్తున్నాయి. నవతరం ప్రతినిధిగా గ్రెటా థంబెర్గ్ వంటి పర్యావరణ కార్యకర్తలు 'మా భవిష్యత్తును నాశనం చేయడానికి మీకెంత ధైర్యం?' అని సంధించిన ప్రశ్నలకు సంపన్న దేశాల నుంచి ఉలుకూపలుకు లేదు. ప్రపంచ దేశాలు కర్బన ఉద్గారాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అరికట్టలేకపోతుండటంతో 2030 తర్వాత భూ ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల పరిమితిని మించిపోయే ప్రమాదముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అయితే అంతకంటే ముందే ప్రమాదం ముంచుకోస్తోందని.. ఎల్ నినో, లా నినా ప్రభావాల కరాణంగా ఈ ఏడాది నుంచి 2027 మధ్యలో ఎప్పుడైనా భూతాపం 1.5 డిగ్రీలకు మించిపోయే వీలుందని డబ్ల్యుఎంఒ ప్రపంచ దేశాలను హెచ్చరిస్తోంది.

భూభాగమే కాదు.. మహాసముద్రాలు కూడా అధిక ఉష్ణోగ్రతలతో మండిపోతున్నాయి. చల్లదనాన్ని నిచ్చే 'లా నినా' మూడేళ్ల పాటు కొనసాగడం వల్ల మానవ కార్యకలాపాల వల్ల ఉత్పన్నమయ్యే వేడికి కాస్తయినా పగ్గాలు పడ్డాయి. కానీ ఈ ఏడాది 'లా నినా' పక్కకు తొలగి అత్యుష్ణాన్ని జనింపజేసే 'ఎల్ నినో' ముందుకొస్తోంది. 2016లో ఎల్ నినో రికార్డు ఉష్ణోగ్రతలకు కారణం కాగా 2027 లోపు ఆ రికార్డు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే వీలుందని డబ్ల్యుఎంఒ నివేదించింది. లా నినా స్థానంలో ఎల్ నినో ప్రవేశించినందున గత మూడేళ్లలో వరదలు వచ్చిన చోట ఇప్పుడు అనావృష్టి..అనావృష్టి నెలకొన్న చోట అతివృష్టితో వరదలు సంభవించే వీలుందన్న శాస్త్రవేత్తలు హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. సముద్రాలు వేడెక్కడమంటే..తుఫానులు పొంచి వున్నాయనే అర్థం. మయన్మార్‌లో ఇటీవల విరుచుకుపడిన మోచా తుఫాను కారణంగా 60 మంది ప్రాణాలు కోల్పోయారు. సుదీర్ఘ తీరప్రాంతమున్న భారత్‌పై ప్రపంచ వాతావరణం మార్పుల ప్రభావం తీవ్రంగానే ఉంటుంది. పెట్టుబడిదారీ దేశాల కారణంగా చోటుచేసుకుంటున్న అసమతుల్య వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలి. విపత్తుల నివారణ సామర్థ్యాలను మెరుగుపర్చుకొని, సహాయక చర్యలకు సంబంధిత మౌలిక సదుపాయాలను పెంపొందించడంలో ఎక్కువ పెట్టుబడులు అవసరం.

ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల కారణంగా దేశవ్యాప్తంగా ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. వడదెబ్బకు వందలాది మంది బలైపోతున్నారు. కరెంటు కోతల వెతలు అన్నీ ఇన్నీ కావు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం కార్మికులు పని ప్రదేశాల్లోనే తనువు చాలిస్తున్నారు. వేసవి వేళ గతంలో ఉదయం పూట పని చేసే సౌకర్యముండేది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేసవి బోనస్ రద్దు చేయడంతో పాటు రెండు పూటలా మస్టర్ అనే నిబంధనను రుద్దడంతో మండు వేసవి లోనూ పని చేయక తప్పని పరిస్థితిలోకి కార్మికులను నెట్టేసింది. అందువల్ల మండుటెండకు బలైపోతున్న ఉపాధి కార్మికుల మరణాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఏపి, తెలంగాణ లోనూ పదుల సంఖ్యలో ఉపాధి కార్మికులు చనిపోతున్నారు. వేసవిలో పని ప్రదేశాల్లో నీడ ఏర్పాటు, మజ్జిగ, త్రాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వంటి చలువ చేసే సదుపాయాలు కల్పించడం ఉపాధి హామీ చట్టంలోనే నిర్దేశించినా.. పాలకులు పట్టించుకోవడం లేదు. కేరళ లోని వామపక్ష ప్రభుత్వం ఇలాంటి విపత్తుల నుంచి ఉపాధి కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక సహాయ నిధిని ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచింది. సంక్షేమ రాజ్యాలుగా గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు కూడా కేరళ తరహాలో ఉపాధి కార్మికులను ఆదుకునేందుకు కృషి చేయాలి. వాతావరణ మార్పుల ప్రభావాలకు ప్రజలు బలైపోకుండా ప్రభుత్వాలు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలి.

మహనీయుని మాట



మనిషి స్వేచ్ఛగా జన్మించాడు.
కాని అన్ని చోట్లా
సంకెళ్లతో బంధించబడి వున్నాడు.
తనను బానిసను చేసే వ్యవస్థపై
మనిషి తిరగబడాలి.

- జీన్ జాక్ రూసో,
తత్వవేత్త, జెనీవా.

ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం ఉద్యమిద్దాం





వి. వెంకటేశ్వర్లు

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు ఒక వరం లాంటిదనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే 2008లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం సంభవించినప్పుడు, 2020లో కరోనా మహమ్మారితో ప్రపంచమంతా తల్లడిల్లినప్పుడు మన దేశం కూడా అందులో చిక్కుకుంది. పారిశ్రామిక, సేవా, రవాణా, భవన నిర్మాణం మొదలుకొని ఐ.టి సంస్థలు సైతం మూతపడ్డాయి. వ్యవసాయ కార్మికులే కాకుండా ఇతర ప్రజానీకం పెద్ద ఎత్తున పని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలను అక్కున చేర్చుకొని పట్టెడన్నం పెట్టింది. వ్యవసాయ కార్మికులు మొదలు పి.జి చదువుకున్న యువతీ యువకులు కూడా ఈ పనికెళ్ళి పొట్ట నింపుకున్నారు. అంతే కాకుండా ఈ చట్టం వల్ల దేశంలో సన్న చిన్నకారు రైతుల భూమిలో కూడా అభివృద్ధి పనులు జరిగేవి. అనేక సంవత్సరాలుగా పూడిక పోయిన చెరువులు, పంట కాలువలు అభివృద్ధి అయ్యాయి. అందుకే 2018లో బిజెపి ప్రభుత్వం ఉపాధి చట్టంలో ఉన్న హామీని తొలగించాలని చూసినప్పుడు ప్రముఖ ఆర్థికవేత్తలు ఈ చట్టం యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ప్రధానమంత్రికి లేఖ రాశారు. ఉపాధి హామీ చట్టం ఉండడం వల్లే భారతదేశం ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోగల్గిందని చివరకు ప్రపంచ బ్యాంకు సైతం కీర్తించింది. ఇంతటి ప్రాధాన్యత కల్గి కోట్లాది మంది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేయాల్సింది పోయి దీని పీక నొక్కడానికి మోడీ ప్రభుత్వం పూనుకుంది. ఒకేసారి చట్టాన్ని రద్దు చేస్తే పేదలు తిరగబడతారనే ఉద్దేశ్యంతో తడిగుడ్డతో గొంతు కోసినట్టు బడ్జెట్‌లో నిధులు తగ్గించింది. 2020-21 సంవత్సరంలో రూ. లక్ష కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది 30 శాతం నిధులు తగ్గించి కేవలం రూ.70 వేల కోట్లతో సరిపెట్టింది. ఇందులో కూడా సుమారు రూ. 20 వేల కోట్లు పాత బకాయిలు ఉన్నాయి. ఇవి పోగా మిగిలినది కేవలం రూ.50 వేల కోట్లు మాత్రమే. ఈ నిధులు అన్ని రాష్ట్రాలకు ఏ లెక్కన ఎంత వస్తుందో మనకు తెలియనిది కాదు. ఈ కారణంగా మన రాష్ట్రంలో ఏటా 25 నుంచి 30 కోట్ల పని దినాలు కల్పిస్తే ఈ సంవత్సరం 19 కోట్ల పని దినాలకు మించి దొరికే అవకాశం లేదు. ఒకే ఏడాది సుమారు 6 కోట్లకు పైగా పని దినాలు తగ్గిపోయాయి. అంతే కాకుండా చట్టంలోని మౌలిక అంశాలను, కనీస సౌకర్యాలను రద్దు చేసింది. రెండు పూటలా పని చేయాలని నిర్ణయించింది. ఎండాకాలంలో ఇస్తున్న 20 శాతం నుండి 30 శాతం అలవెన్స్‌ను తొలగించింది. చివరకు గుక్కెడు మంచినీళ్ళ కోసం ఇస్తున్న డబ్బులను సైతం రద్దు చేసింది. పొమ్మనకుండా పొగబెట్టి, పేదలే ఈ పథకం వద్దనేలా కేంద్ర ప్రభుత్వం కుట్రకు పూనుకున్నది. దీనికి తందాన అంటూ మన రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ వాటా 10 శాతం నిధులను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నది.

ఒకే ఏడాది సుమారు 6 కోట్లకు పైగా పని దినాలు తగ్గిపోయాయి. అంతే కాకుండా చట్టంలోని మౌలిక అంశాలను, కనీస సౌకర్యాలను రద్దు చేసింది. రెండు పూటలా పని చేయాలని నిర్ణయించింది. ఎండాకాలంలో ఇస్తున్న 20 శాతం నుండి 30 శాతం అలవెన్స్‌ను తొలగించింది. చివరకు గుక్కెడు మంచినీళ్ళ కోసం ఇస్తున్న డబ్బులను సైతం రద్దు చేసింది. పొమ్మనకుండా పొగబెట్టి, పేదలే ఈ పథకం వద్దనేలా కేంద్ర ప్రభుత్వం కుట్రకు పూనుకున్నది. దీనికి తందాన అంటూ మన రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ వాటా 10 శాతం నిధులను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నది.

అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసి వామపక్ష పార్టీల ఒత్తిడితో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడం బిజెపి ప్రభుత్వానికి ఇష్టంలేదు. 2006 ఏప్రిల్ 2న మన రాష్ట్రంలో అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లిలో ప్రారంభమైనప్పటి నుండి ఉపాధి హామీపై ఇంత తీవ్రమైన దాడి ఏనాడూ జరగలేదు. గడిచిన రెండేళ్ళ నుండి ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి అన్ని ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండడం, ఉన్న కొద్దిపాటి పనుల్లో కూడా యంత్రాలు ప్రవేశించడం వల్ల గ్రామీణ పేదలకు పని లేక పెద్దఎత్తున వలసలు పోతున్నారు. చన్నీళ్ళకు వేన్నీళ్ళు తోడైనట్లు ఉపాధి చట్టం ఉండబట్టి కొంత ఉపశమనం కలుగుతున్నది. ఈ చట్టాన్ని కాపాడుకోకపోతే గ్రామీణ పేదల ఉపాధే ప్రశ్నార్థకంగా మారుతుంది.

రెండు పూటలా ఎందుకు పని చేయాలి?

ఉపాధి చట్టంలో పని చేసే కార్మికులకు రోజు వేతనం కాకుండా పీస్ రేట్ (కొలతలు) ప్రకారంగా వేతనాలు ఇస్తారు. మనం ఎన్ని గంటలు పని చేయాలన్న నిబంధన లేదు. ఎంత పని చేస్తే అంతే వేతనం చెల్లిస్తారు. అటువంటిది రెండు పూటలా పని చేయాలనే నిబంధన ఎక్కడా లేదు. ఈ ఏడాది రెండు పూటలా పని చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల చాలా చోట్ల ఉదయం 6 గంటలకు వెళ్ళి 11 గంటల తరువాత ఇళ్ళకు చేరుకోవాలి. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు వెళ్ళి సాయంత్రం 5 గంటల వరకు చేయాలనే నిబంధన విధించడమే కాకుండా ఆన్‌లైన్‌లో హాజరు తీసుకోవాలని నిర్ణయించారు. ఒకవేళ ఆ పేదలు పని అయిపోయిన సమయానికి సర్వర్ డౌన్ అయ్యి నెట్ రాకపోతే ఎన్ని గంటలైనా ఎదురు చూడాలి. లేకపోతే ఆరోజు పని చేసినా హాజరు పడదు. దీని వల్ల కూలీలు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. ఎర్రటి ఎండలో 5 నుండి 10 కి.మీ. వెళ్ళి చేతులు బొబ్బలెక్కేలా పని చేసినా గ్రామీణ పెత్తందార్లు ఓర్వలేక ఉచితంగానే డబ్బులు వస్తున్నాయని కూలీలపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఉపాధి చట్టం ఉంటే పేదలు తమ మాట వినడం లేదని, చెల్లుబాటు కావడం లేదని ఈ చట్టాన్ని రద్దు చేయాలని గోల చేస్తున్నారు. వీరి మాటలకు తలొగ్గిన బిజెపి ప్రభుత్వం అనేక షరతులు పెట్టి ఉపాధి హామీ చట్టం పీక నొక్కడానికి పూనుకున్నది.

సమ్మర్ అలవెన్స్

ఎండా కాలంలో నేల గట్టిగా ఉంటుంది. కాబట్టి తవ్వడం సాధ్యం కాదు. చాలా చోట్ల పేదలే ముందు రోజు సాయంత్రం పని చేసే చోట ట్యాంకర్లతో నీళ్ళు పోసి మరుసటి రోజు ఉదయం పని చేస్తారు. కాబట్టి ఎండాకాలంలో ఫిబ్రవరి, జూన్ నెలల్లో 20 శాతం... మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారు. ఒకానొక సందర్భంగా 50 శాతం కూడా ఇచ్చారు. చట్టం ప్రారంభం అయినప్పటి నుండి వున్న ఈ అలవెన్స్‌ను ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం కావాలనే రద్దు చేసింది. దీనివల్ల ఎర్రటి ఎండలో చేతులు బొబ్బలెక్కేలా పని చేసినా గిట్టుబాటు కూలి రావడం లేదు. పేదలు ఈ పని మానుకుంటే తప్పుడు మస్టర్లు సృష్టించి కాంట్రాక్టర్లు, దళారులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారు. ఒకానొక సందర్భంగా 50 శాతం కూడా ఇచ్చారు. చట్టం ప్రారంభం అయినప్పటి నుండి వున్న ఈ అలవెన్స్‌ను ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం కావాలనే రద్దు చేసింది. దీనివల్ల ఎర్రటి ఎండలో చేతులు బొబ్బలెక్కేలా పని చేసినా గిట్టుబాటు కూలి రావడం లేదు. పేదలు ఈ పని మానుకుంటే తప్పుడు మస్టర్లు సృష్టించి కాంట్రాక్టర్లు, దళారులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

కనీస సౌకర్యాల కొరత

పనిచేసే చోట భద్రత, ఎండలో సేద తీరడానికి టెంటు, మంచినీళ్ళ కోసం రూ.5, 5 కి.మీ దూరం మించి పనికి వెళ్ళాల్సి వస్తే రాను పోను చార్జీలు, గునపం సాన పట్టడానికి డబ్బులు, తట్టకు రూ.5, మేట్లకు రూ.3 ఇచ్చేవారు. గాయాలైతే ప్రాథమిక చికిత్సకు మెడికల్ కిట్లు, ఐదుగురి పిల్లలకు ఒక ఆయాను ఇచ్చేవారు. గర్భిణీలు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు చేయగలిగే పనులు ఇచ్చేవారు. వీరు 70 శాతం పని చేసినా 100 శాతం వేతనం ఇవ్వాలని చట్టంలో కూడా ఉంది. కాని నేడు బిజెపి ప్రభుత్వం ఇవన్నీ రద్దు చేసింది. రాష్ట్ర ప్రభుత్వమైనా ఈ కనీస సౌకర్యాలను అందించలేకపోతున్నది.

మస్టర్లు

చట్టం ప్రారంభం నుండి ప్రతివారం ఒక మస్టర్ ఇచ్చి ప్రతి ఒక్కరితో అటెండెన్స్ తీసుకొని, ప్రతి శనివారం అటెండెన్స్ పూర్తి చేసి, కొలతలు వేసి ఎపిఒ ఆఫీస్‌కి పంపేవారు. దీనితో పాటు అదే రోజు ఒక్కొక్క మనిషికి ఎంత వేతనం వస్తుందో ప్రతి కార్మికుడు తెలుసుకోవడానికి పే స్లిప్‌లు ఇచ్చేవారు. నేడు అవన్నీ రద్దు చేసి ఆన్‌లైన్‌లో అటెండెన్స్ తీసుకోవాలని నిర్ణయించింది. ఈ కారణంగా పని చేసే చోట నెట్ సౌకర్యం అందుబాటులో లేకపోతే అప్‌లోడ్ కాక చేసిన పని కూడా వృధా అవుతుంది, మస్టర్ కూడా పడదు. రాష్ట్రంలో చాలా గ్రామాలలో ముఖ్యంగా ఏజెన్సీలో ఫోనే పని చేయదు. అలాంటిది నెట్ సౌకర్యం ఎక్కడుంటుంది? దీనివల్ల అవినీతి కూడా పెరిగింది.

గతంలో ప్రతి 10-20 మందికి ఒక గ్రూపు, దానికి ఒక మేట్ ఉండేవాడు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం మేట్లను తొలగించి వారి స్థానంలో సైట్ సూపర్‌వైజర్లను నియమిస్తున్నది. వీరికి కనీసం ఫోన్ కూడా ఇవ్వలేదు. కొన్నిచోట్ల క్షేత్రస్థాయి సిబ్బంది పై అధికారులతో, రాజకీయ నాయకులతో కుమ్మక్కై పని చేయని వారి దొంగ మస్టర్లు చేర్పించి డబ్బులు మింగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పేరుతో పేదల డబ్బులు కొల్లగొడితే...నేడు ప్రభుత్వ భవనాలు, సిమెంట్ రోడ్ల పేరుతో యంత్రాలను ఉపయోగించి కాంట్రాక్టర్లు, అధికార పార్టీ నాయకులు పేదల నిధులను బొక్కేస్తున్నారు. కాబట్టి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలతో సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున పోరాడాల్సిన సమయం ఆసన్నమైనది. ఒకపక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీకి నిధులు ఇవ్వకుండా కుట్ర చేస్తుండగా... మరోపక్క దేశంలోకెల్లా ఆదర్శవంతంగా కేరళ రాష్ట్రం ఉపాధి హామీ చట్టాన్ని గ్రామీణ ప్రాంతాలకే కాకుండా పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరింపచేసింది. ఉపాధి హామీలో పని చేస్తున్న పేదలను ఆదుకోవడానికి ఒక ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసింది. ప్రతి కార్మికుడు నెలకు రూ.50 చెల్లిస్తే ప్రభుత్వం దానికి తోడు చేస్తున్నది. ఈ డబ్బును వ్యవసాయ కార్మికుల కుటుంబాలు తమ పిల్లల చదువులకు, పెళ్ళిళ్ళకు, శుభ అశుభ కార్యక్రమాలకు వాడుకోవచ్చు. కేరళ ప్రభుత్వం పేదల కోసం ఇంత సహాయం చేస్తే...కార్పొరేట్లు, పెట్టుబడిదారుల భజన చేస్తున్న బిజెపి ప్రభుత్వం ఉపాధి పీక నొక్కడానికి పూనుకుంది. అటువంటి బిజెపి ప్రభుత్వానికి మనం బుద్ధి చెప్పాలి. అంతేగాక ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం, బడ్జెట్‌లో నిధుల పెంపుకు, కనీస సౌకర్యాల అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాలు చేపట్టిన ఉద్యమంలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులందరూ పాల్గొనాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

/ వ్యాసకర్త వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్ : 94900 98980 /

విశ్లేషణ

మోడీ హయాంలో మత స్వేచ్ఛకు ప్రమాదం



వి. రాంభూపాల్

మన రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛ పరిస్థితులు దిగజారాయని, ఇందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతపరమైన వివక్షాపూరిత విధానాలే కారణమని అంతర్జాతీయ మత స్వేచ్ఛ పరిస్థితులపై అమెరికన్ సంస్థ ఇటీవల విడుదల చేసిన వార్షిక నివేదిక వెల్లడించింది. కర్ణాటక ఎన్నికల్లో ప్రజల తీర్పు, మహారాష్ట్రలో థాకరే ప్రభుత్వ కూల్చివేత-ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పులు, లైంగిక వేధింపులపై రెజ్లర్లు ఢిల్లీలో చేస్తున్న ఆందోళన, ఇప్పుడు మత స్వేచ్ఛపై అంతర్జాతీయ నివేదిక కేంద్రంలోని బిజెపి నేతలకు ఉక్కపోతను మరింత పెంచింది. నరేంద్ర మోడీ ఇంటా బయటా ఎదురులేని మొనగాడని, విశ్వగురువు అని, అంతర్జాతీయ శాంతిదూత అని...ఏవేవో భుజకీర్తులు తగిలించి, ఆహా ఓహో అని కీర్తించిన గోడీ మీడియా ఈ వరుస ఘటనలతో కుడితిలో పడిన ఎలుక లాగా గిజగిజలాడుతున్నది.

మత స్వేచ్ఛ నివేదికలో ఏముంది?

అమెరికన్ విదేశాంగ శాఖ ఆధీనంలోని స్వతంత్ర సంస్థ 'యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రెలిజియస్ ఫ్రీడమ్' (యుఎస్‌సిఐఆర్‌ఎఫ్) ప్రపంచంలోని వివిధ దేశాల్లో మత స్వేచ్ఛ పరిస్థితులపై ప్రతి సంవత్సరం నివేదికలు రూపొందించి అక్కడి ప్రభుత్వానికి అందచేస్తుంది. భారతదేశంలో మత అసహనం, ప్రార్థనా స్థలాలు, మైనారిటీ ప్రజల ఆస్తులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, తప్పుడు కేసులు, నిర్బంధాలు పెరుగుతున్నాయని ఈ నివేదిక తెలిపింది. 2022లో దేశంలో జరిగిన సంఘటనలు, ప్రభుత్వ లెక్కల ఆధారంగా ఈ నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించి మత స్వేచ్ఛ అమలు విషయంలో ప్రత్యేక ఆందోళనకర పరిస్థితులు నెలకొన్న దేశాల జాబితాలో మన దేశాన్ని చేర్చాలని అమెరికా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. గతంలో కూడా ఈ సంస్థ దేశంలోని మత ఉద్రిక్తతలను ప్రస్తావించింది. మత స్వేచ్ఛ విషయంలో కొనసాగుతున్న అనేక దుష్పరిణామాలను ఈ సంవత్సరం విడుదల చేసిన నివేదికలో ప్రస్తావించడంతో పాటు, వాటి మూలాలను విశ్లేషించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25-28 ప్రకారం ప్రతి పౌరుడికి తనకు ఇష్టమొచ్చిన మతాన్ని స్వీకరించడానికి, ప్రచారం చేసుకోవడానికి, ఏ మతాన్ని ఆరాధించకుండా వుండడానికి స్వేచ్ఛ వుంది. అయితే 2014లో బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుండి ఈ లౌకిక సూత్రాలకు, మైనారిటీల మత స్వేచ్ఛకు ప్రమాదం ఏర్పడిందని పేర్కొంది.

ఇంకా ఈ నివేదికలో 'హిజాబ్, గోవధ లాంటి అంశాలపై వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు (బిజెపి పాలిత రాష్ట్రాలు) రూపొందిస్తున్న చట్టాలు, న్యాయస్థానాల తీర్పులు దేశంలోని ముస్లింలు, క్రైస్తవులు, దళితులు, ఆదివాసీల మత స్వేచ్ఛను హరించివేసే విధంగా వుంటున్నాయి. విమర్శనాత్మక గొంతులను కేంద్ర ప్రభుత్వం అణచిపెడుతున్నది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలను, వారికి అండగా నిలుస్తున్న వ్యక్తులను, సంస్థలను లక్ష్యంగా చేసుకొని వారిపై నిఘా, వేధింపులు, ఇళ్ల కూల్చివేత, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద సంవత్సరాల తరబడి నిర్బంధించడం లాంటివి పెరిగాయ'ని తెలిపింది. స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాల ఆర్థిక మూలాలను దెబ్బతీసే విధానాలను కేంద్రం ఉద్దేశ్యపూర్వకంగానే అమలు చేస్తున్నదని పేర్కొంది. మత స్వేచ్ఛ కోసం కృషి చేస్తున్న అనేకమంది జర్నలిస్టులు, లాయర్లు, మానవ హక్కుల కార్యకర్తలు నిర్బంధాలకు, వేధింపులకు గురవుతున్నారనే పచ్చి నిజాన్ని బయటపెట్టింది. 2019లో పౌరసత్వ చట్ట సవరణ బిల్లుకు నిరసనగా జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారనే సాకుతో అనేక వేల మందిపై పెట్టిన వందలాది కేసులు ఇప్పటికీ పెండింగ్‌లో వున్నాయని, 2022 వరకు 700 కేసులు నమోదు కాగా, వాటిలో కేవలం 92 కేసులు మాత్రమే విచారణ దశకు వచ్చాయని తెలిపింది. అయితే ఈ కేసులు నమోదు అయినా అనేకమంది ఎలాంటి విచారణ లేకుండా సంవత్సరాలుగా జైళ్లలోనే మగ్గుతున్నారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో 12 రాష్ట్ర ప్రభుత్వాలు (ఉత్తరప్రదేశ్, కర్ణాటక, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, ఉత్తరా ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిషా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్) మత మార్పిడిని చట్టవిరుద్ధ నేరంగా పరిగణించే చట్టాలను రూపొందించాయని ఈ నివేదిక తెలిపింది. చట్టపరమైన మత మార్పిడికి గతంలో వున్న నిబంధనలను పూర్తిగా మార్చివేసి మత స్వేచ్ఛను అణచివేసే విధంగా ఈ రాష్ట్రాల్లో నిబంధనలను రూపొందించారు. ఈ అంశాలన్నిట్లోనూ ఉత్తరప్రదేశ్ దూకుడుగా వుంది. మతాన్ని మార్చుకున్న వారికి, ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన వారికి భారీగా అపరాధ రుసుములు వేయడం, జైళ్లలో నిర్బంధించడం, వారి ఆస్తులు ధ్వంసం చేయడం పెరిగిందని పేర్కొంది.

బిజెపి ఇతర రాజకీయ పార్టీల లాంటిది కాదు. ఈ పార్టీని ఏర్పాటు చేసినది, నడుపుతున్నది... రాజ్యాంగాన్ని గుర్తించని లేదా ఆమోదించని ఆర్‌ఎస్‌ఎస్ అనే మత సంస్థ. ఈ సంస్థ దృష్టిలో 'హిందూ మత విశ్వాసాలను ఆచరించని వారంతా విదేశీయులు. అందువల్ల వీరంతా హిందూ మత జాతీయ సంస్కృతినీ, భాషనూ తమదిగా స్వీకరించి, ఆచరించాలి లేదా దేశంలో అమలవుతున్న అన్ని నీతి నియమాలకు, కట్టుబాట్లకు లోబడి వారి కృపాకటాక్షాలతో ఏ హక్కులు లేని పరాయివారిగా బతకాలి.' ఈ వికృత సిద్ధాంతాన్ని అమలు చేయాలని తహతహలాడుతున్న పాలకులకు పరమత సహనం, మత స్వేచ్ఛ అనేవి ఏ మాత్రం గిట్టవు.



చట్టబద్ధ మతాంతర వివాహాలను నిరోధిస్తూ అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాయి. ముస్లిం యువత చేసుకునే ప్రేమ వివాహాలపై 'లవ్ జిహాద్' పేరుతో ప్రజల్లో తప్పుడు ప్రచారం చేసి పాలకులు, వారి అనుయాయులు మత విద్వేషాన్ని పెద్ద ఎత్తున రగిలిస్తున్నారు. మతాంతర వివాహాలను పుజారి లేదా పోలీసులు అంగీకరించడానికి లేదా అంగీకరించకుండా వుండడానికి హక్కులు కల్పిస్తూ ఏప్రిల్‌లో హర్యానా ప్రభుత్వం చట్టాన్ని తెచ్చింది. కర్ణాటకలో రగిల్చిన హిజాబ్ సమస్య, గుజరాత్‌లో బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదల, ఉత్తరప్రదేశ్‌లో దళిత మహిళలపై కొనసాగుతున్న హత్యాచారాలు, దాడుల గురించి ఈ నివేదిక పేర్కొంది. పెరుగుతున్న మత హింస ఘటనల ఆధారంగా భారత దేశంలో మత స్వేచ్ఛ ప్రమాదంలో వుందని, అందువల్ల ప్రత్యేక ఆందోళనకర దేశాల జాబితాలో మన దేశాన్ని చేర్చాలని ఈ సంస్థ అమెరికా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

కేంద్ర ప్రభుత్వ స్పందన

విభిన్న మతాలకు నిలయమై, లౌకిక విధాన పునాదిపై భిన్నత్వంలో ఏకత్వాన్ని ఆచరిస్తున్న దేశ ప్రతిష్టను కేంద్ర బిజెపి పాలకులు, వారి మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఈ విధంగా దిగజార్చాయి. కానీ 'ఈ నివేదక పక్షపాతం మరియు నిందాపూర్వకమైనదని' మన విదేశాంగ మంత్రిత్వ శాఖ విమర్శించింది. తీవ్రమైన అవగాహనా లోపంతో ఈ నివేదిక తయారుచేయబడిందని కేంద్రం ఎదురు దాడికి సిద్ధమైంది. మరి ట్రంప్ అధ్యక్షుడుగా వున్న కాలంలో హౌడీ మోడీ, నమస్తే ట్రంప్ కార్యక్రమాల మోత మోగించారు కదా! అంతెందుకు! ప్రధాని మోడీ 2021 సెప్టెంబర్ నెలలో అమెరికా పర్యటన సందర్భంగా నాయకుల పరస్పర పొగడ్తలు, వచ్చే నెల 22న మరోసారి ప్రధాని అమెరికా పర్యటనకు చేస్తున్న హంగామా చూస్తూనే వున్నాం. అంతర్జాతీయ మీడియా ప్రచార హోరులో ఊయలలూగినప్పుడు పక్షపాతం గుర్తుకు రాలేదే? ఇలాంటి నివేదికలు ప్రకటించే అమెరికా సంస్థలన్నీ గొప్పవని, అవి ఇచ్చే నివేదకలన్నీ చాలా పవిత్రమైనవని అనుకోలేము. కాని తమను కీర్తించినప్పుడు ఒకరకంగా, నిందించినప్పుడు మరో రకంగా స్పందించే పాలకుల తీరు ప్రజావిశ్వాసాన్ని పొందదు.

దేశంలో మత స్వేచ్ఛ ఎందుకు ప్రమాదంలో పడింది?

బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ద్విముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నది. ఒకటి మత రాజ్యాన్ని నిర్మించడం. అందుకోసం మత విద్వేషాన్ని నిత్యం రగల్చడం. ఇతర మతస్థుల ఆచార, సాంప్రదాయాలన్నిట్లోకి జొరబడి వాటిపై దాడి చేయడం. రెండు కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను, సామాజిక రిజర్వేషన్లను బలహీనపర్చడం, రాజ్యాంగ హక్కులను కాలరాయడం, రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేయడం. గౌతమ్ అదానీ ఆర్థిక అరాచకాల గురించి హిండెన్‌బర్గ్ నివేదిక, మత స్వేచ్ఛ గురించి యుఎస్‌సిఐఆర్‌ఎఫ్ నివేదిక, అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు ప్రకటిస్తున్న ర్యాంకింగ్ లెక్కలు ఈ విధానాల ప్రతిరూపమే.

అంతేగాక, తమ మతతత్వ విధానాలను అమలు పరచడానికి మత చిహ్నాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఉదా: గో సంరక్షణ పేరుతో 2014 నుండి దేశవ్యాపితంగా 147 దాడులు జరిగాయి. ఇందులో 58 మంది హత్యగావించబడ్డారు. కర్ణాటక ఎన్నికలకు ముందు గో రక్షణ దళాలు ఇద్దరు మైనారిటీ మతస్థులను చంపడం, ఒకరిని హింసించడం చూశాము. కేంద్ర ప్రభుత్వం 2017 మే లో కేంద్రం గోవధ నిషేధాన్ని ప్రకటించింది. అన్య మత పూజా ప్రదేశాల మీద దాడులు చేయడం పెరిగింది. శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా దేశంలో అనేక చోట్ల మసీదులపై దాడులు జరిగాయి. ఈ సందర్భంగానే యు.పి లో మైనారిటీ సంస్థ నిర్వహిస్తున్న అతి పెద్ద ప్రాచీన గ్రంథాలయాన్ని తగుల బెట్టారు. మత మార్పిళ్ల సాకుతో ముఖ్యంగా క్రిస్టియన్లపై దాడులు పెరిగాయి. అసత్యాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

పరమత సహనమే హిందూ మతానికి జీవం అని ఒకవైపున అనుభవం చెబుతుంటే, మరోవైపున హిందూ ధర్మ సంరక్షకులు, గో సేవా దురంధరుల వేషాలు వేసుకున్న కొద్దిమందికి పరమత ద్వేషం జీవగర్ర అయింది. వీరికి కేంద్రంలోని ప్రభుత్వం అండగా నిలిచింది. బిజెపి ఇతర రాజకీయ పార్టీల లాంటిది కాదు. ఈ పార్టీని ఏర్పాటు చేసినది, నడుపుతున్నది...రాజ్యాంగాన్ని గుర్తించని లేదా ఆమోదించని ఆర్‌ఎస్‌ఎస్ అనే మత సంస్థ. ఈ సంస్థ దృష్టిలో 'హిందూ మత విశ్వాసాలను ఆచరించని వారంతా విదేశీయులు. అందువల్ల వీరంతా హిందూ మత జాతీయ సంస్కృతినీ, భాషనూ తమదిగా స్వీకరించి, ఆచరించాలి లేదా దేశంలో అమలవుతున్న అన్ని నీతి నియమాలకు, కట్టుబాట్లకు లోబడి వారి కృపాకటాక్షాలతో ఏ హక్కులు లేని పరాయివారిగా బతకాలి.' ఈ వికృత సిద్ధాంతాన్ని అమలు చేయాలని తహతహలాడుతున్న పాలకులకు పరమత సహనం, మత స్వేచ్ఛ అనేవి ఏ మాత్రం గిట్టవు. దేవనూరు మహదేవ అన్నట్లు 'భారత దేశంలో ద్రవిడ, ఆర్య, ఇస్లాం, క్రైస్తవ రక్తాలన్నీ వేరుచేయలేనంతగా కలిసిపోయాయి.' వీటిని విడదీయాలని చూడడం అనాగరికం, ఆటవికం. కాని అనేక కారణాల వల్ల ప్రజలు ఈ విధ్వంసకులకు కొద్ది కాలం మద్దతు ఇవ్వవొచ్చుగాక. అనుభవం నేర్పుతున్న పాఠాల నుండి...వీరికి సరైన సమయంలో సరైన గుణపాఠం ఆ ప్రజలే చెబుతారన్నది చరిత్ర చెప్పున్న సత్యం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు /

జి-7 దేశాల సదస్సుకు నిరసన సెగ

హిరోషిమాలో భారీ ర్యాలీ

హిరోషిమా : రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా జరిపిన అణు దాడికి నేలమట్టమైన హిరోషిమా నగరమే శుక్రవారం నాటి జి-7 దేశాల సదస్సుకు వేదికైంది. సామ్రాజ్యవాద దేశాల కూటమి జి-7కు వ్యతిరేకంగా హిరోషిమాలో ప్రపంచ వ్యవస్థను తన వేలితో శాసించాలని చూసే జి-7ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా వేలాదిమంది ఆందోళనకారులు సదస్సు వేదికకు చాలా దగ్గరలోనే వున్న శాంతి పార్క్ వద్ద గుమిగూడారు. "జంక్ జి 7", "యుద్ధాన్ని పురిగొల్పవద్దు", "జపాన్-అమెరికా సైనిక పొత్తు వద్దు " అంటూ నినాదాలు రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు. సదస్సు జరిగే వేదిక చుట్టూ ఆందోళనకారులు ప్రదర్శన నిర్వహించారు. "అమెరికా సామ్రాజ్యవాదులు, నెంబర్ వన్ టెర్రరిస్ట్", అస్త్రాలు ఆపండి, యుద్ధాన్ని ఆపండి, క్వాడ్ కూటమి వద్దు, నాటో కూటమి వద్దు అని నినాదాలు చేశారు. అమెరికా యుద్ధ వ్యతిరేక పౌర సంస్థ సభ్యుడు కొడీ అర్బన్ కూడా ఈ ప్రదర్శనల్లో వున్నారు. అమెరికా నేతృత్వంలో సాగే జి-7 సదస్సును "ఉద్రిక్తతలు సృష్టించేందుకు సంపన్న దేశాల కుట్ర"గా ఆయన అభివర్ణించారు. అమెరికన్లుగా మేం అమెరికా ప్రభుత్వాన్ని సమర్ధించడం లేదు అని చెప్పడానికే తానిక్కడకు వచ్చానని 32ఏళ్ళ కొడీ అర్బన్ చెప్పారు. నిరసన తెలియచేసేందుకే ఆయన ఒరెగావ్ రాష్ట్రం నుండి ఇక్కడకు వచ్చారు. జి-7 ఎజెండాను తామంతా వ్యతిరేకిస్తున్నాము. సంపన్న ప్రభుత్వాల ఎజెండా అదని అంతేకానీ శాంతి సుస్థిరతల ఎజెండా కాదని స్పష్టం చేశారు. హిరోషిమాతో సహ జపాన్‌లో పలు నగరాల్లో శుక్రవారం నిరసనలు, ర్యాలీలు జరిగాయి. దేశ విదేశాల నుండి వచ్చిన వారు వీధుల్లోకి వచ్చి జి-7కి వ్యతిరేకంగా నినదించారు.

ఉక్రెయిన్‌కు వత్తాసు, రష్యాపై ఆంక్షలు

ఉక్రెయిన్‌కు ఆయుధాలు, రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని జి 7 దేశాలు నిర్ణయించాయి. యుద్ధ సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక పరికరాలు, సేవలపై మరిన్ని కఠినమైన ఆంక్షలను విధిస్తున్నట్లు వెల్లడించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభమై 15మాసాలైన నేపథ్యంలో రష్యాను ఎలాగైనా దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఈ ఆంక్షలు విధించాయి...రష్యాపై ఆధారపడటం తగ్గించాలని, అలాగే జి-7 ఆర్థిక వ్యవస్థలను రష్యా ఉపయోగించుకునే అవకాశాలను మరింత నియంత్రించనున్నట్లు భావిస్తున్నట్లు జి-7 తెలిపింది.. ప్రస్తుతమున్న ఆంక్షల వ్యవస్థనుండి తప్పించుకోకుండా నివారించడానికి కూడా తాము చర్యలు తీసుకుంటామని తెలిపాయి. అంతకుముందు అమెరికా సహా జి 7 దేశాలు తాము స్వంతంగా తీసుకునే చర్యలను ప్రకటించాయి. రష్యా, ఇతర దేశాలకు చెందిన మరో 70 సంస్థలను అమెరికా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టనున్నట్లు అమెరికా సీనియర్ ప్రభుత్వాధికారి వెల్లడించారు. అలాగే రష్యాతో జరిగే వజ్రాల వ్యాపారాన్ని బ్రిటన్ లక్ష్యంగా చేసుకుంది. రాగి, అల్యూమినియం, నికెల్‌తో పాటూ రత్నాల దిగుమతులపై నిషేధం విధించనున్నట్లు ప్రకటించింది. రష్యాలో దొరికే, ఉత్పత్తయ్యే లేదా ప్రాసెస్ అయ్యే వజ్రాలను వినియోగించడం, వాటి వ్యాపారం ఆంక్షలు విధిస్తున్నట్లు జి 7 ప్రకటన పేర్కొంది.

భారత్ సహా పలు దేశాల నేతలు, కొన్ని అంతర్జాతీయ సంస్థలు కూడా ఈ సదస్సులో పాల్గొంటున్నాయి. ఉక్రెయిన్ సంక్షోభం, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, వాతావరణమార్పులతో సహ ప్రధాన అంశాలన్నీ ఈ సమావేశాల్లో చోటు చేసుకునే అవకాశం వుంది. అయితే స్పష్టమైన ప్రకటన లేదా ఫలితాలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా వున్నాయి.

జెలెన్‌స్కీ, మోడీ భేటీకి యత్నాలు

హిరోషిమాలో జరుగుతున్న జి-7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో విడిగా భేటీ అయ్యే అవకాశాలను అన్వేషిస్తున్నట్లు భారత దౌత్యవర్గాలు తెలిపాయి. మోడీ తన మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం జి-7 సదస్సుకు అతిథి హోదాలో హాజరయ్యారు. తరువాత పపువా-న్యూగినియా, ఆస్ట్రేలియాలో ఆయన పర్యటిస్తారు.

సమాన అవకాశాలు, సహకారమే కీలకం

- చైనా-సెంట్రల్ ఆసియా దేశాల సదస్సు ప్రారంభం
- నేతలను సాదరంగా ఆహ్వానించిన జిన్‌పింగ్ దంపతులు

జియాన్ : చైనా, మధ్య ఆసియా దేశాల సంబంధాల్లో కొత్త శకం ఆరంభమైందని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. ఈ రెండు పక్షాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలను ప్రకటించారు. పలు ప్రతిపాదనలు చేశారు. చైనా, సెంట్రల్ ఆసియా దేశాల శిఖరాగ్ర సమావేశం గురువారం జిన్‌పింగ్ అధ్యక్షతన వాయవ్య నగరమైన జియాన్‌లో ప్రారంభమైంది. అంతర్జాతీయంగా ఎన్ని మార్పులైనా జరగనీ, దానితో నిమిత్తం లేకుండా చైనా, సెంట్రల్ ఆసియా దేశాలు ఎల్లప్పుడూ పరస్పరం గౌరవించుకుంటారని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఇరుగు పొరుగు దేశాల మధ్య వుండే స్నేహ సంబధాలను కొనసాగిస్తామన్నారు. సమాన అవకాశాలు, సహకారానికి కట్టుబడతామన్నారు. ఇరుగు పొరుగు దేశాల స్థాయి నుండి వ్యూహాత్మక భాగస్వాములు అక్కడ నుండి భవితవ్యాన్ని పంచుకునే కమ్యూనిటీ స్థాయికి చైనా సంబంధాలు అభివృద్ధి చెందాయన్నారు. ఇటువంటి సంబంధాలెప్పుడూ ప్రాంతీయ శాంతి, అభివృద్ధికి సానుకూల శక్తిని చొప్పిస్తాయన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనా ఎక్స్‌ప్రెస్‌లోకి ఎక్కాల్సిందిగా సెంట్రల్ ఆసియా దేశాలకు స్వాగతం పలుకుతున్నామన్నారు. చైనా-సెంట్రల్ ఆసియా సహకారానికి మరింత మెరుగైన భవితవ్యాన్ని కలిసి సృష్టిద్దామన్నారు. సుస్థిరమైన, సంపద్వంతమైన, సామరస్యతతో కూడిన సెంట్రల్ ఆసియా ఈనాడు ప్రపంచానికి అవసరమని అన్నారు. ఈ ప్రాంతంలో ఘర్షణలు, అసమ్మతి రెచ్చగొట్టే హక్కు ఎవరికీ లేదన్నారు. ఉమ్మడి అభివృద్ధి పంథాను అనుసరిస్తూ , చైనాతో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు సెంట్రల్ ఆసియా దేశాల నేతలు తమ కృత నిశ్చయాన్ని ప్రకటించారు.

ఈ తరహాలో మైలురాయి అనదగ్గ ఈ ఉన్నత స్థాయి సదస్సు ప్రారంభమైన తీరు, చైనా దౌత్య ఎజెండాలో సెంట్రల్ ఆసియాకు పెరుగుతున్న ప్రాముఖ్యతను తెలియచేస్తోందని రాజకీయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. సంక్లిష్టమైన అంతర్జాతీయ, ప్రాంతీయ పరిస్థితుల నేపథ్యంలో చైనా ఇంధనం, వ్యూహాత్మక భద్రతకు పెరుగుతున్న ప్రాముఖ్యతను తెలియచేస్తోందన్నారు.

నేతలకు సాదర స్వాగతం

జియాన్‌లో టాంగ్ వంశానికి చెందిన ఇంపీరియల్ గార్డెన్‌లోని టాంగ్ ప్యారడైజ్ వద్ద సెంట్రల్ ఆసియా నేతలు, వారి సతీమణులను చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ దంపతులు సాదరంగా స్వాగతించారు. కజక్, తజక్, కిర్గిజ్ అధ్యక్షులు బుధవారానికే జియాన్ చేరుకోగా, ఉజ్బెక్, తుర్క్‌మినిస్తాన్ అధ్యక్షులు గురువారం చేరుకున్నారు.

కర్ణాటకలో కొలువు తీరనున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- నేటి ప్రమాణ స్వీకారోత్సవానికి ముస్తాబైన కంఠీరవ స్టేడియం

బెంగళూరు : కర్ణాటకలో సుమారు 10 ఏళ్ల విరామం తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరనుంది. ఇక్కడి కంఠీరవ స్టేడియంలో శనివారం మధ్యాహ్నం 12:30 గంటలకు ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డికె శివకుమార్, మరికొంత మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, గాంధీ కుటుంబ సభ్యులు, పాల్గొననున్నారు. అలాగే ఈ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొనాలని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి కాంగ్రెస్ ఆహ్వానాలు పంపింది. అలాగే ఎన్‌సిపి అధ్యక్షులు శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షులు ఫరూక్ అబ్దుల్లా, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌లకు కూడా కాంగ్రెస్ ఆహ్వానం పంపింది. శనివారం ప్రమాణస్వీకారం కార్యక్రమం సందర్భంగా బెంగళూరులో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. మరోవైపు శుక్రవారం సిద్దరామయ్య, డికె శివకుమార్ శుక్రవారం ఢిల్లీకు చేరుకున్నారు. క్యాబినేట్ కూర్పు గురించి కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించారు. మళ్లీ రాత్రికి బెంగళూరుకు చేరుకున్నారు.

ముగ్గురిని ఉరి తీసిన ఇరాన్

- ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్లో హింసకు పాల్పడ్డారంటూ ఆరోపణ

దుబాయ్ : గతేడాది ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల సందర్భంగా హింసకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురిని ఇరాన్ శుక్రవారం ఉరి తీసింది. మానవ హక్కుల గ్రూపుల నుండి అభ్యంతరాలు వచ్చినప్పటికీ వాటిని పట్టించుకోకుండా తమ తీర్పును అమలు చేసింది. ఇరాన్ న్యాయ వ్యవస్థ వెబ్‌సైట్ అయిన మిజాన్ ఆ ముగ్గురు వ్యక్తుల ఉరితీతను ప్రకటించింది. గత నవంబరులో దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో ఆ ముగ్గురు వ్యక్తులు ఒక పోలీసు అధికారిని, ఇద్దరు పేరా మిలటీ సిబ్బందిని చంపేశారని అధికారులు తెలిపారు. కాగా, మానవ హక్కుల గ్రూపులు ఈ విషయాన్ని ఖండిస్తున్నాయి. వారిని వేధింపులకు గురి చేశారని, టివిల ముందు తాము ఆ నేరం చేసినట్లుగా బలవంతంగా ఒప్పించారని, అందాల్సిన న్యాయ ప్రక్రియను అందనివ్వకుండా తిరస్కరించారని హక్కుల గ్రూపులు పేర్కొంటున్నాయి. ఇస్లామిక్ డ్రస్ కోడ్‌ను ఉల్లంఘించినందుకు పాక్ పోలీసులు అరెస్టు చేసిన 22ఏళ్ల యువతి మాషా అమిని కస్టడీలో వుంటుండగా చనిపోయిన తర్వాత గత సెప్టెంబరులో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఇటీవలి కాలంలోనే ఈ నిరసనలు తగ్గుముఖం పట్టాయి. ఈ నిరసనలకు సంబంధించి ఇరాన్ మొత్తంగా ఏడుగురిని ఉరి తీసింది. ప్రభుత్వ రహస్య భద్రతా కోర్టులు వారికి మరణశిక్ష విధించాయని, తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే అవకాశాన్ని వారికి తిరస్కరించారని మానవ హక్కుల గ్రూపులు విమర్శిస్తున్నాయి.

23, 24 తేదీల్లో చైనాలో రష్యా ప్రధాని పర్యటన

బీజింగ్ : ఈనెల 23, 24 తేదీల్లో రష్యా ప్రధాని మిఖాయిల్ మిషుస్తిన్ చైనాలో పర్యటిస్తారని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ, క్రెమ్లిన్‌లు శుక్రవారం ప్రకటించాయి. చైనా ప్రధాని లీ కియాంగ్ ఆహ్వానం మేరకు రష్యా సమాఖ్య ప్రధాని చైనాలో వచ్చే వారం అధికార పర్యటన జరపనున్నారని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనను ధృవీకరిస్తూ క్రెమ్లిన్, వాణిజ్యం, ఆర్థిక రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారంపై ఈ పర్యటనలో చర్చలు జరుగుతాయని తెలిపింది. పరిశ్రమలు, ఇంధనం, రవాణా మౌలిక సదుపాయాలు, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు జరిగే అవకాశం వుంది.

'అక్రమాలు కనిపించలేదు'

అదానీ గ్రూప్‌పై సుప్రీంకు నిపుణుల కమిటీ నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ గ్రూప్ కంపెనీలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలపై నిజాల నిగ్గు తేల్చేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీ తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. అదానీ గ్రూప్ కంపెనీల స్టాక్స్‌లో కృత్రిమ వ్యాపార ధోరణి కనిపించలేదని తెలిపింది. 2020 నుంచి దర్యాప్తులో ఉన్న 13 విదేశీ సంస్థల యాజమాన్యాన్ని సెబీ నిర్ణయించలేకపోయినట్లు తెలిపింది. ఏది ముందు, ఏది తరువాత అనే అంశాన్ని నిర్ధరించలేని సందిగ్ధావస్థలో పడినట్లు తెలిపింది. ఈ నివేదికతో అదానీ గ్రూప్ కంపెనీలకు క్లీన్ చిట్ లభించినట్లయింది. అదానీ గ్రూప్‌పై దర్యాప్తు కోసం కమిటీని సుప్రీంకోర్టు మార్చిలో నియమించింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎఎం సప్రే నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో సభ్యులుగా ఒపి భట్, జస్టిస్ జెపి దేవధర్, కెవి కామత్, నందన్ నీలేకని, సోమశేఖర్ సుందరేశన్‌లను నియమించింది. ఈ కమిటీ తన నివేదికను ఇటీవల సుప్రీంకోర్టుకు సమర్పించింది. దీనిని సుప్రీంకోర్టు శుక్రవారం ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.

రెగ్యులేటరీ ఫెయిల్యూర్ ఉన్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో కనిపించలేదని ఈ నివేదిక తెలిపింది. అదానీ స్టాక్స్ విషయంలో 849 ఆటోమేటెడ్ "సస్పిషియస్" అలర్ట్‌లను సిస్టమ్ సృష్టించినట్లు తెలిపింది. ఈ అలర్ట్‌లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు పరిశీలించినట్లు తెలిపింది. నాలుగు నివేదికలను సెబీకి సమర్పించినట్లు పేర్కొంది. వీటిలో రెండిటిని హిండెన్‌బర్గ్ నివేదికకు ముందు, రెండిటిని ఆ తరవాత అందజేసినట్లు వివరించింది.

అంతర్జాతీయ సెక్యూరిటీ సంస్థలు కానీ, బ్యాంకులు కానీ తమతో మాట్లాడటానికి ఇష్టపడలేదని తెలిపింది. అదానీ గ్రూప్‌తో తమకు వ్యాపార సంబంధాలు ఉన్నందువల్ల ఆసక్తుల సంఘర్షణ ఏర్పడుతుందని కొన్ని అంతర్జాతీయ సంస్థలు చెప్పినట్లు తెలిపింది. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన తరువాత అదానీ లిస్టెడ్ స్టాక్స్‌లో రిటెయిల్ మదుపరుల కార్యకలాపాలు పెరిగినట్లు ఈ కమిటీ నివేదిక తెలిపింది. చట్టాల ద్వారా నియంత్రణ వైఫల్యం ఉందా.. లేదా.. అనేదానిని నిర్ధరించ డం చాలా కష్టమని తెలిపింది. పటిష్టమైన విధానాన్ని అమలు చేయవలసిన అవసరం ఉందని చెప్పింది. సెబీ అనుసరిస్తున్న లెజిస్లేటివ్ పాలసీకి అనుగుణంగా ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ పాలసీ ఉండాలని చెప్పింది. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలవడానికి ముందు కొన్ని సంస్థలు షార్ట్ పొజిషన్స్ తీసుకున్నాయని, హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన తరువాత ఆ సంస్థలు లాభపడ్డాయని తెలిపింది. ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ కేటగిరీలో దాదాపు 42 మంది మదుపరుల వివరాలు మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్నట్లు తెలిపింది.

మణిపూర్ ప్రభుత్వంతో చర్చల్లేవ్

- పది మంది కుకీ ఎమ్మెల్యేలు, ప్రజా సంఘాల నిర్ణయం

ఇంఫాల్ : మణిపూర్‌లోని బీరెన్‌సింగ్ ప్రభుత్వానికి కుకీ ఎమ్మెల్యేలు షాకిచ్చారు. మొత్తం 10 మంది కుకీ ఎమ్మెల్యేలు, వివిధ పౌర సంఘాలు.. ప్రభుత్వంతో చర్చలకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నాయి. ఈనెల 3న తమ వర్గానికి, మైటీస్‌కు మధ్య హింసాత్మక ఘర్షణల నేపథ్యంలో ఎన్ బీరెన్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంతో ఎలాంటి చర్చలు జరపకూడదని నిర్ణయించాయి. బీజేపీకి చెందిన ఎనిమిది మంది శాసనసభ్యులు, మణిపూర్‌కు చెందిన ఆదివాసీ గిరిజన నాయకుల ఫోరమ్, కుకి ఇన్పి మణిపూర్, జోమీ కౌన్సిల్, హ్మర్ ఇన్‌పుయ్, ఇతర ప్రజా సంఘాల సభ్యులతో సహా శాసనసభ్యుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐజ్వాల్‌లో ఈ సమావేశం జరిగింది. ఈనెల 3 నుంచి మణిపూర్‌లో హింసాకాండ మొదలైన విషయం విదితమే.

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు

విశ్వనాథన్, ప్రశాంత్‌కుమార్ ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ: భారత సర్వోన్నత న్యాయస్థానంలో ఇద్దరు న్యాయమూర్తులు కొత్తగా కొలువుదీరారు. జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్‌లతో శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఇద్దరు జడ్జీల నియామకంతో సుప్రీం కోర్టులో మొత్తం జడ్జీల సంఖ్య గరిష్ఠ పరిమితి 34కు (సీజేఐతో కలిపి) చేరింది. అయితే, సుప్రీం కోర్టులో ఈ పూర్తిస్థాయి జడ్జీల సంఖ్య కొద్ది కాలం మాత్రమే కొనసాగనుంది. జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ వీ రామసుబ్రమణియన్‌లు వచ్చే నెలలోనే పదవీ విరమణ చేయనున్నారు.సుప్రీం కోర్టు జడ్జీలుగా జస్టిస్ మిశ్రా, సీనియర్ న్యాయవాది విశ్వనాథన్ పేర్లను సిజెఐ నేతృత్వంలోని కొలీజియం ఈ నెల 16న కేంద్రానికి సిఫారసు చేసింది. రెండు రోజుల్లోనే ఈ నియామకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి లభించింది. వీరిద్దరి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ఆమోదముద్ర వేశారు.

ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి..

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తిగా 13 ఏళ్లకుపైగా అనుభవం ఉంది. హైకోర్టుల న్యాయమూర్తుల ఆల్ ఇండియా సీనియారిటీ జాబితాలో 21వ స్థానంలో ఉన్నారు.

బార్ కౌన్సిల్ నుంచి నేరుగా సుప్రీంకు..

తమిళనాడుకు చెందిన సీనియర్ న్యాయవాది విశ్వనాథన్ బార్ కౌన్సిల్ నుంచి నేరుగా సుప్రీం కోర్టు జడ్జిగా ఎంపికయ్యారు. సీనియార్టీ ప్రకారం 2030 ఆగస్టు 11న జస్టిస్ జేబీ పార్దీవాలా పదవీ విరమణ అనంతరం జస్టిస్ విశ్వనాథన్ సీజేఐగా నియమితులు కానున్నారు. 2031 మే 25వరకు ఆ పదవిలో ఉంటారు. న్యాయవాదిగా అనేక కీలక కేసులు వాదించిన జస్టిస్ విశ్వనాథన్ ఇటీవల స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కేసులోనూ పిటిషనర్ల తరపున వాదనలు వినిపించారు.

రూ.2,000 నోట్లు వెనక్కి

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. దీంతో నల్లధనం దాచుకునే వారికి మరింత సులభం అయ్యిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఆర్‌బిఐ యాక్ట్ 1934లోని సెక్షన్ 24(1) ప్రకారం.. 2016 నవంబర్‌లో రూ.2వేల నోటును ఆర్‌బిఐ చలామణిలోకి తీసుకొచ్చింది. మార్చి 2017 నాటికి మొత్తం కరెన్సీలో రూ.2000 నోట్ల వాటా విలువ 89 శాతంగా ఉంది. 2018 మార్చి 31 నాటికి రూ.6.73 లక్షల కోట్లు (37.3శాతం), 2023 మార్చి 31 నాటికి రూ.3.62 లక్షల కోట్లు లేదా 10.8 శాతానికి పెద్ద నోట్ల చలామణి తగ్గింది. 2018-19 నుంచి ఈ నోట్ల ముద్రణను ఆర్‌బిఐ పూర్తిగా నిలిపివేసింది. క్లీన్ నోట్ పాలసీలో భాగంగా రూ.2,000 నోట్ల చలామణీని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్లు ఆర్‌బిఐ ప్రకటించింది.2వేల రూపాయల నోటు చాలా కాలంగా ఎటిఎంలలో అందుబాటులో లేవు. ఎప్పుడో ఒకప్పుడు దీనిని రద్దు చేయవచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, అందుకు ఎంచుకున్న సమయం పలు అనుమానాలకు తావిస్తున్నదని నిపుణులు కొందరు వ్యాఖ్యానించారు.

నకిలీ నోట్ల హల్‌చల్

రూ.2000 నోట్లను చలామణిలోకి తెచ్చిన తర్వాత దేశంలో నకిలీ నోట్ల బెడద వంద శాతం పైగా పెరిగింది. 2016లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసి రూ.2 వేల నోట్లను ప్రవేశ పెట్టిన తర్వాత నకిలీ నోట్ల చలామణి ఏకంగా 107 రెట్లు పెరిగిందని స్వయంగా కేంద్ర ప్రభుత్వ గణంకాలే పేర్కొంటున్నాయి. 2016లో దేశవ్యాప్తంగా నకిలీ రూ.2వేల నోట్లు 2,272 పట్టుబడగా.. 2020లో వీటి సంఖ్య ఏకంగా దాదాపు 2.45 లక్షలకు చేరిందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మేఘా పార్మర్‌కు బిజెపి ప్రభుత్వం షాక్

భోపాల్: మధ్యప్రదేశ్ నుంచి ఎవరెస్ట్ పర్వత శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళగా రికార్డు సృష్టించిన మేఘా పార్మర్ కు రాష్ట్ర ప్రభుత్వం షాకిచ్చింది. 'బేటీ బచావో బేటీ పడావో', రాష్ట్ర డెయిరీ బ్రాండ్ సాంచికి ప్రచారకర్తగా ఉన్న ఆమెను ఆ బాధ్యతల నుంచి తొలగించింది. పార్మర్ కాంగ్రెస్‌లో చేరడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

మేఘా పార్మర్ ఇటీవల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఈనెల 9న ఛింద్వాడాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్ సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బ్రిజ్‌భూషణ్ అరెస్ట్‌కు రేపటితో ముగియనున్న అల్టిమేటం

సచిన్ పైలట్ సంఘీభావం

మద్దతుగా మహిళా సంఘాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని రెజ్లర్లు, రైతులు పోలీసులకు ఇచ్చిన అల్టిమేటం ఆదివారంతో ముగియనుంది. బ్రిజ్‌భూషణ్‌ను రహస్యంగా విచారించినట్లు చెబుతున్నప్పటికీ, తదుపరి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈనెల 21న జంతర్ మంతర్‌లో జరిగే రైతు సంఘాల సమావేశంలో భవిష్యత్ ఆందోళనను ప్రకటించనున్నారు. మరోవైపు సరిహద్దుల్లోనే రైతులను పోలీసులు అడ్డుకోవాలని యోచిస్తున్నారు. దీనికి ముందు ఈ ప్రదేశాల్లో పికెట్లు కూడా ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ల జంతర్ మంతర్ వద్దకు చేరుకుంటాయన్న సమాచారం రావడంతో భారీ స్థాయిలో బారికేడ్లు కూడా ఏర్పాటు చేశారు.కాగా, రెజ్లర్ల పతకాలు వేలం వేస్తే కేవలం 15 రూపాయలే లభిస్తాయన్న బ్రిజ్‌భూషణ్ ఆరోపణపై సాక్షి మాలిక్ స్పందించారు. 15 ఏళ్ల కష్టాన్ని బిజెపి ఎంపి ఎగతాళి చేశారని, దేశానికి సాధించిన పతకాలు ఎవరి దాతృత్వం కాదని ఆమె అన్నారు. శుక్రవారం జంతర్ మంతర్‌లోనే రెజ్లర్ల ఆందోళన కొనసాగింది. దీంతో రెజ్లర్ల ఆందోళన 27వ రోజు పూర్తి చేసుకుంది. వామపక్ష మహిళా సంఘాలు సంఘీభావంతో నిరసన వేదిక వద్దకు చేరుకున్నాయి. కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ కూడా శుక్రవారం నిరసన ప్రదేశాన్ని సందర్శించారు. కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ నిరసన తెలిపిన మల్లయోధుల "న్యాయబద్ధమైన డిమాండ్"ని వీలైనంత త్వరగా నెరవేర్చాలని, చట్టం పరిధిలో "నిష్పాక్షిక" విచారణ జరగాలని అన్నారు. "గత 26-27 రోజులుగా మన అగ్రశ్రేణి క్రీడాకారులు చాలా బాధలో ఉన్నారు. వారు తమపై జరిగిన అకృత్యాలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వారు ఇన్ని రోజులుగా వేడుకుంటు న్నారు. తమకు తగిన గౌరవం లభించేలా వేచి ఉన్నారు. వారి గొంతులు విని వారికి న్యాయం చేయాలని కోరుతున్నా" అని పైలట్ అన్నారు. దేశంలోని యువ తరం, రైతులు, మల్లయోధులు సంతోషంగా లేనప్పుడు దేశం సంతోషంగా ఉండదన్నారు. అథ్లెట్లు దేశానికి పతకాలు తెస్తే యావత్ దేశం ఆనందిస్తోందని, అదే ప్రజలు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. "మల్లయోధులు డిమాండ్ చేస్తున్న వాటిపై నిష్పాక్షిక విచారణ మేము కోరుకుంటున్నాము. వారు దేశానికి కీర్తిని తెచ్చారు. వారి కారణంగా మేము మా తలలు ఎత్తుకున్నాం. వారు కన్నీళ్లు కారుస్తున్నారంటే, వారు సంతోషంగా లేరని అర్థం" అని అన్నారు. "చట్టపరిధిలో వారి మాట వినండి. వారికి న్యాయం చేయడంలో జాప్యం జరిగితే ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఎందుకు ఇలా జరుగుతోందో, ఎవరి ఒత్తిళ్లతో" అని పైలట్ పేర్కొన్నారు.



రెజ్లర్లకు సంఘీభావంగా మహిళా సంఘాలు నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న సుభాషిణి అలీ, ఇతరులు


రైతుల ఆందోళన నేపథ్యంలో భారీ భద్రత

నిరసన చేస్తున్న రెజ్లర్లకు మద్దతుగా ఆదివారం రైతుల సమావేశం దృష్ట్యా ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్ వద్ద, దేశ రాజధాని సరిహద్దుల్లోని తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఒక అధికారి తెలిపారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేయడంతోపాటు సరిహద్దు ప్రాంతాల్లో పికెట్లను పెంచుతామని పోలీసులు తెలిపారు. జంతర్ మంతర్, చుట్టుపక్కల ప్రాంతాల్లో తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తామని, నిరసన స్థలంలో ఇప్పటికే బహుళ లేయర్ బారికేడ్లు ఉంచామని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఆ ప్రాంతమంతా సిసిటివి కెమెరాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతాల్లోనూ పికెట్లు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేస్తామని మరో అధికారి తెలిపారు. అవసరమైతే అదనపు భద్రతా సిబ్బందిని నియమిస్తామని, ఢిల్లీ సరిహద్దుల్లో కూడా పెట్రోలింగ్‌ను పెంచనున్నట్లు తెలిపారు.




షోకేస్

- వి.అమన్ దీప్,
2వ తరగతి,
సెయింట్ జేవియర్స్ స్కూలు,
ఎల్ ఎమ్ కాంపౌండ్,
ముద్దనూరు
కడప జిల్లా.



వి.రియాన్ రోస్
2వ తరగతి
సెయింట్ జేవియర్స్ స్కూల్
ఎల్ ఎమ్.కాంపౌండ్
ముద్దనూరు

బుజ్జి తమ్ముడు



శాంతపురం అనే ఊరిలో పద్మ, కిషోర్ అనే దంపతులు ఉన్నారు. వారికి రీల అనే అమ్మాయి ఉంది. తర్వాత నాలుగు సంవత్సరాలకు బాబు జన్మించాడు. రీలకు తన తమ్ముడిని ఎత్తుకోవాలని చాలా ఇష్టంగా ఉండేది. కాని పద్మ బాబుని ఇచ్చేది కాదు. ఓసారి ' అమ్మా! నాకు తమ్ముణ్ని ఎత్తుకోవాలని ఉంది.' అని అడిగింది. అప్పుడు అమ్మ 'రీల నువ్వు చిన్న అమ్మాయివి. తమ్ముడిని ఎత్తుకోలేవు' అని కసిరింది.

ఒక రోజు బాబు గాఢంగా నిద్రిస్తుండగా పద్మ, కిషోర్ కట్టెలు తీసుకురావడానికి వెళ్ళారు. రీలను ఇంట్లోనే ఉంచారు. వెంటనే వస్తామని అడవికి వెళ్లారు. కొంతదూరం వెళ్లాక వారికి పులి కనిపించింది. పులి నుంచి తప్పించుకోవాలని చూసి అడవిలో దారి తప్పిపోయారు. చీకటి పడినా ఇంకా అమ్మ, నాన్న రాకపోవడంతో, రీల తొట్టెలో ఏడుస్తున్న తమ్ముడికి పాలు కాచి, సీసా పట్టించింది. అర్ధరాత్రి దాటిన తర్వాత పద్మ, కిషోర్ ఇంటికి చేరారు. తొట్టెలో ఆడుకుంటున్న బాబుని చూసి ఆనందం కలిగింది పద్మకి. ఆ రోజు నుంచి బాబును ఎత్తుకోమని రీలకి ఇవ్వసాగింది. దాంతో బుజ్జి తమ్ముడిని ఆనందంగా ఎత్తుకుని మురిసిపోయింది రీల.



- ఎదుల్ల అభిషేక్
9వ తరగతి, జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.

సువర్ణ ముఖి నది చూశాం



హాయ్ ఫ్రెండ్స్,
నా పేరు సుజయ్.
ఎనిమిదవ తరగతి చదివా.
మాది తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి.
మా ఊరులో నడి బొడ్డున సువర్ణ ముఖి నది ఉంది. దాని విశేషాలు మీతో పంచుకోవాలి. ఆ నది మీద ఉన్న ఒక వంతెన ఉంది. దాని పేరు రామసేతు వంతెన అంటారు.

పూర్వం ఈ నదిలో బంగారం దొరికేదంట. చూసారా... నేను స్వర్ణ ముఖినది పై ఉన్న రామ్ సేతు వంతెన పై ఫోటో దిగాను. ఈ నది ఆనుకుని గాలి గోపురం ఉంటుంది. గోపురం పక్కనే శ్రీకాళహస్తి ఈశ్వర ఆలయం ఉంది. ఇది దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధి శైవ క్షేత్రం. శ్రీ అనగా సాలెపురుగు, కాళ అనగా నాగు పాము, హస్తి అనగా ఏనుగు.. ఈ మూడూ శివుని సేవలో తరించాయి అట. కనుక ఈ స్థలానికి శ్రీకాళహస్తి అని పేరు వచ్చిందని చెబుతారు. శివునికి పరమ భక్తుడైన భక్తి కన్నప్ప కొండ కూడా ఆలయానికి ఆనుకుని ఉంది. ఇంకా కొండలు నడుమ భరద్వాజ తీర్థం అనే కొలను ఉంటుంది. శ్రీకాళహస్తి కలంకారికి ప్రసిద్ధి. ఈ నదిని ఆనుకుని దుర్గమ్మ కొండ, కుమార స్వామి కొండలు ఉన్నాయి. గుడి దగ్గరలో వ్యాసాశ్రమం ఉంది. దీన్ని దాటి వేయి లింగాల కోన ఉంది. ఇలా ఎన్నో చూడు దగ్గ ప్రదేశాలు మా ఊరి దగ్గర ఉన్నాయి. మరి మీరంతా సెలవుల్లో మా ఊరికి వస్తారు కదూ!



-కె.సుజయ్,
8 వ తరగతి,
శ్రీ వివేకానంద స్కూలు
శ్రీకాళహస్తి,
తిరుపతి జిల్లా.

బొమ్మరిల్లు





- యనమల శ్రీ హర్ష,
6వ తరగతి, ఆక్స్‌ఫర్డ్ స్కూలు,
అత్తంటివారిపాలెం,
వలేటివారి పాలెం మండలం,
నెల్లూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

మీ కోసం

రెండు స్పూన్ల బేకింగ్ సోడాలో కొంచెం నిమ్మరసం కలిపి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. ఈ పేస్ట్‌ను మురికిపట్టిన ఫ్రిజ్ రబ్బరుపై 5 నిమిషాల పాటు రుద్దాలి. 10 నిమిషాల తరువాత శుభ్రమైన నీటితో కడిగితే మురికి పోతుంది.



జీవన సౌరభం

నా ఒక్కడి వల్లే దేశం మారిపోతుందా అనుకునే ఏ ఒక్కడి వల్లా దేశానికి ఉపయోగం లేదు.

జీవిత సవాళ్లు ఎదుర్కొని

పేదరికం, అత్తింటి వేధింపులు, భర్త హింస ఉంటే ఏ మహిళైనా కుంగిపోతుంది. కాని సవితా ప్రధాన్ మాత్రం వాటిని అధిగమించి చదువుకున్నారు. ఇద్దరు పిల్లల్ని పోషిస్తూనే ఉద్యోగ పోటీ పరీక్షలు రాశారు. ఉన్నత స్థాయిలో ఉద్యోగం సంపాదించాలన్న సంకల్పంతో ఎదురైన ప్రతి సవాలునూ ఎదుర్కొన్నారు. చివరికి సాధించారు. ఇప్పుడు మధ్యప్రదేశ్ అర్బన్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. తనలాగా ఎవరూ వేధింపులకు గురి కాకూడదని మహిళల కోసం ఓ ఛానెల్ నడుపుతూ చైతన్య పరుస్తున్నారు.



మధ్యప్రదేశ్‌లో మండై గ్రామానికి చెందిన సవితా పేద కుటుంబంలో పుట్టింది. ఐదుగురు సంతానంలో ఆమె ఒకరు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లేవారు. దగ్గర్లో ఉన్న అడవిలోకి వెళ్లి టెండు ఆకులు, మహువ పూలు సేకరించి అమ్మేవారు. సవితాకు చిన్నప్పటి నుంచి చదువు అంటే ఇష్టం. కాని పాఠశాలకు పంపే స్థోమత తమకు లేదంటూ తల్లిదండ్రులు పంపేవారు కాదు. చదువుకుంటే రూ. 75 స్కాలర్‌షిప్ వస్తుందని, దాంతో కావాల్సిన పుస్తకాలు కొనుక్కుంటా అని గొడవపడి మరీ పాఠశాలకు వెళ్లింది. ఒక యూనిఫాం ఒంటి మీద ఉంటే మరో యూనిఫాం ఉతుక్కునేది. ఇంట్లో రోజూ పొందే దలియా (గంజి) చేసేవారు. ఒక్కోసారి అది ఉండేది కాదు. అయినా స్కూలుకు మాత్రం మానకుండా వెళ్లేది. ఆ తర్వాత 7 కి.మీ. దూరంలో పల్వేరాలో ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంది. రోజూ నడిచి వెళ్లి రావడం కష్టమవుతున్నా సవితా మాత్రం చదువు ఆపలేదు. ఆమె పట్టుదల చూసి కుటుంబమే ఆ ఊరికి మకాం మార్చింది. 22 మంది అబ్బాయిలున్న తన క్లాసులో ఇద్దరే అమ్మాయిలు. అయినా ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా స్కూలుకు వెళ్లింది. అలా ఆ ఊరిలోనే పదవ తరగతి చదివిన మొదటి అమ్మాయిగా పేరు తెచ్చుకుంది.

వేధింపులు తట్టుకోలేక

పై చదువులు చదివించే స్థోమత లేక తల్లిదండ్రులు సవితకు భోపాల్‌కు చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. అతను ఆమె కన్నా 11 ఏళ్ల పెద్దవాడు. పెళ్లయిన తర్వాత ఆమె జీవితం నరకప్రాయంగా మారింది. అత్తమామలు ఆమెను పనిమనిషిలా మార్చారు. సరిగ్గా తిండి పెట్టేవారు కాదు. ఆకలి తట్టుకోలేక చపాతీలు బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్లి తిన్న సందర్భాలూ ఉన్నాయి. మాట్లాడినా, నవ్వినా తిట్టేవారు. ఆమెను టీవీ చూడకుండా బంధించేవారు. బాధలు తట్టుకోలేక చనిపోదాం అనుకుంది. వెంట వెంటనే ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. దాంతో ఆత్మహత్య ప్రయత్నాలు మానుకుంది. భర్త పిల్లల్నీ హింసించడంతో చివరకు తట్టుకోలేక వారిని తీసుకుని పుట్టింటికి వచ్చింది.





పని చేస్తూ...చదువు

తల్లిదండ్రులు, తోడబుట్టిన వారు సవితకు మద్దతుగా నిలిచారు. వారి సహకారంతో మళ్లీ చదువు కొనసాగించింది. డిగ్రీలో చేరింది. ఇంటి దగ్గర చిన్నపిల్లలకు ట్యూషన్ చెబుతూ, బ్యూటీపార్లర్లో పని చేస్తూ తన పిల్లల్ని పోషించింది. అప్పుడు రాష్ట్ర సివిల్ సర్వీసెస్ గురించి తెలిసి ఆ వైపుగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. దానికి సంబంధించిన మెటీరియల్, జనరల్‌నాలెడ్జీ బుక్స్ తెచ్చుకుని ఇంట్లోనే చదువుకున్నారు. ఆమె ఎదుగుదల తట్టుకోలేక అత్తింటి వారు వచ్చి దాడి చేశారు. అయినా సవితా తట్టుకుని నిలబడ్డారు. ఎన్నో ఇబ్బందులు పెట్టిన భర్త నుంచి విడాకులు తీసుకొంది. అప్పుడు సవితాను చుట్టూ ఉన్నవారు రకరకాలుగా మాటలు అన్నారు. 'ఇద్దరు పిల్లలు ఉన్నా... భర్తను వదిలేస్తున్నావా?' అని అడిగి ఇబ్బంది పెట్టేవారు. అవేమీ ఆమె పట్టించుకోలేదు. చదువు మీద దృష్టికేంద్రీకరించారు. దాంతో 24 ఏళ్ల వయస్సులో చీఫ్ మున్సిపల్ అధికారిగా బాధ్యతలు చేపట్టింది. 2021లో ఖాండ్వా మున్సిపల్ కార్పొరేషన్‌కి తొలి మహిళా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు ప్రస్తుతం పట్టణ పరిపాలన విభాగంలో రాష్ట్ర మొదటి మహిళా జెడిగా బాధ్యతలు తీసుకుని ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. అత్తింటి వేధింపులకు గురవుతున్న మహిళల కోసం ఏకంగా 'హిమ్మత్ వాలీ లడ్కియాన్' (బ్రేవ్ గర్ల్స్) అనే యూట్యూబ్ ఛానెల్‌ని నడుపుతున్నారు. వారికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తూ అండగా నిలుస్తున్నారు.

ఎండల వేళ పిల్లల సంరక్షణ ఇలా..

ఎండవేడికి చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ప్రభావితమౌతారు. ముఖ్యంగా ఈ కాలంలో చిన్నపిల్లలకు చర్మ వ్యాధులు అధికంగా వస్తాయి. వాటి నివారణకు కొన్ని చిట్కాలు పాటించాలి.



- తరచూ పిల్లలతో నీటిని తాగించాలి.
- పౌష్టిక ఆహారాన్ని అందించాలి.
- అధిక వేడి వల్ల ఒక్కోసారి చిన్నపిల్లల ముక్కు నుంచి రక్తం కారుతుంటుంది. దాని నివారణకు పిల్లలు డిహైడ్రేడ్ కాకుండా చూసుకోవాలి. అయినా తగ్గకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.
- వేసవిలో చిన్నపిల్లల్లో యూరినరీ ఇన్ఫెక్షన్స్ వస్తుంటాయి. ఇన్ఫెక్షన్ రాకుండా వుండాలంటే నీళ్లతో పాటు కొబ్బరి నీరు, నిమ్మరసం తాగించాలి.
- అధిక ఉష్ణోగ్రతలకు చిన్నపిల్లల్లో స్పృహ కోల్పోవడం, వాంతులు విరేచనాలు కావడం జరుగుతుంది. ఈ సైడ్ ఎఫెక్ట్స్ బారిన పడకుండా ఉండాలంటే ఫ్రిడ్జ్ నీళ్లను తాగకుండా, కుండ నీటిని తాగడం మంచిది. డిహైడ్రేట్ కాకుండా కుండ నీరు మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.
- చర్మ వ్యాధులు, చీము గడ్డలు, ఎలర్జీ వంటి వ్యాధులు కూడా పిల్లల్లో ఈ సమయంలో ఎక్కువగా కనబడతాయి. వీటి నివారణకు ఆకుకూరలు, పెరుగు, గుడ్లు వంటి వాటిని క్రమం తప్పకుండా ఇవ్వాలి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి బిజెపి ముప్పు

- మతరాజ్యంతో సమాజ విచ్ఛిన్నం
- లోక్‌సభ పూర్వ సెక్రటరీ జనరల్ పిడిటి చారి
- హైదరాబాద్‌లో సుందరయ్య 38వ స్మారకోపన్యాసం



సుందరయ్య 38వ వర్ధంతి సభలో స్మారకోపన్యాసం చేస్తున్న లోక్‌సభ పూర్వ సెక్రటరీ జనరల్ పిడిటి చారి, చిత్రంలో బివి రాఘవులు, తెలకపల్లి రవి, ఎస్ వినయకుమార్ తదితరులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కేశవానంద భారతి కేసులో తీర్పు ప్రకారం ప్రాథమిక హక్కులతోసహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నయినా సవరించే అధికారం పార్లమెంటుకుంటుంది. అయితే, రాజ్యాంగపు మౌలిక సూత్రాలను సవరించే అధికారం ఉండదు. పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజార్టీ ఉంది కాబట్టి ఈ దేశాన్ని ధార్మిక రాజ్యంగా మార్చేద్దామని పాలకపక్షం అనుకుంటే కేశవానంద భారతి తీర్పును తిరస్కరించే మరో తీర్పు రావొచ్చు. అప్పుడు రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకు పూర్తి అధికారాలు వస్తాయి. సంఖ్యా బలం ఉన్న పాలకపక్షం కోరుకుంటే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష తరహా పాలన అంటూ రాజ్యాంగాన్ని సవరించొచ్చు' అని లోక్‌సభ పూర్వ సెక్రటరీ జనరల్ పిడిటి చారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పిడిటి చారి, బివి రాఘవులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 'భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం - సవాళ్లు రాజ్యాంగ విలువలు' అనే అంశంపై స్మారకోపన్యాసంలో చారి మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు ఐకాన్ సుందరయ్య అని అన్నారు. కేరళలో తాను చదువుకునే రోజుల్లో ఇఎంఎస్ నంబూద్రిపాద్, ఎకె గోపాలన్, పి.సుందరయ్య పేర్లు బలంగా వినిపించేవని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీని నిర్మించడంలో సుందరయ్య కీలకపాత్ర పోషించారన్నారు. బిజెపికి మెజార్టీ ఉన్నందున పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష తరహా పాలన వచ్చే ప్రమాదం లేకపోలేదని పేర్కొన్నారు. ఈ దిశగా రాజ్యాంగాన్ని సవరించే అవకాశముందన్నారు. దేశంలో ప్రజలందరికీ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి భావనలను రాజ్యాంగం అందించిందని వివరించారు. భారతదేశాన్ని ఆధునిక ప్రపంచంలోకి నడిపించిన ఆయుధం రాజ్యాంగమన్నారు. దేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే మెరుగైన పరిపాలన చక్రమని తెలిపారు. పార్లమెంటు తొలినాళ్లలో ప్రతిపక్ష సభ్యులు ఎక్కువగా మాట్లాడేవారని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారని, విస్తృతంగా చర్చించి చట్టాలను రూపొందించే వారని వివరించారు. ప్రస్తుతం చర్చ లేకుండానే బిల్లులు ఆమోదం పొందుతున్నాయని, ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమివ్వడం లేదని అన్నారు. ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లు వంటి వాటిపైనా ఐదు లేదా పది నిమిషాలు చర్చించి ఆమోదిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రతిష్టంభన దీర్ఘకాలం కొనసాగితే ఈ వ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోయి మరో ప్రత్యామ్నాయ వ్యవస్థ వైపు ఆలోచించే ప్రమాదముందన్నారు. అధ్యక్ష తరహా పాలనవైపు మొగ్గు చూపే అవకాశముందని పేర్కొన్నారు. గతంలో ప్రతిపక్ష పార్టీల నాయకులతో ప్రధాని నేరుగా సంప్రదించే వారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ప్రతిపక్ష సభ్యులను శత్రువులుగా భావిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యం కార్యనిర్వాహక వర్గం చేతుల్లో బందీ అయిందని పేర్కొన్నారు. పార్లమెంటును, ఇతర స్వతంత్ర వ్యవస్థలను అది నియంత్రిస్తోందన్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉండాల్సిన మీడియాను ప్రభుత్వానికి బాకాగా మారేలా అనేక ఒత్తిళ్లకు గురిచేస్తోందని విమర్శించారు. లౌకికత్వంతోనే దేశానికి మనుగడ సాధ్యమన్నారు. మత రాజ్యంతో రాజ్యాంగ విలువలైన లౌకికత్వం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటివి కోల్పోయే ప్రమాదముందని పేర్కొన్నారు. తప్పుడు చరిత్రను సృష్టించడానికి, వాస్తవాలను తలకిందులు చేయడానికి నేటి పాలకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం విలువ అర్థమైతేనే రాజ్యాంగ విలువలను రక్షించుకోవడానికి ప్రజలు సన్నద్ధమవుతారని పేర్కొన్నారు. అనేక పరిణామాలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను హరిస్తోన్నా, స్పందించలేని పరిస్థితికి చేరుకుంటామన్నారు. నాగరికత ప్రస్థానంలో ఏ ఒక్క తరం నిస్తేజంగా మారినా ఫాసిస్టు రాజ్యం ఏర్పడే ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, లౌకికత్వానికి వచ్చే పెనుప్రమాదాన్ని ప్రజలు తిప్పికొట్టాలని కోరారు.

బిజెపిని ఓడిస్తేనే దేశం ముందుకు : రాఘవులు

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ శక్తులను రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓడిస్తేనే దేశం ముందుకెళ్లడం సాధ్యమవుతుందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ బివి రాఘవులు అన్నారు. బిజెపి పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మీద దాడి జరుగుతోందని, మనుధర్మం, ఫాసిస్టు పాలన తేవాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికత్వం, ప్రజాస్వామ్యం, ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం ప్రమాదంలో పడ్డాయన్నారు. ఎన్నికల కమిషన్, పార్లమెంటు, న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగ వ్యవస్థలను మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మతం, మత విశ్వాసాలను ముందుకు తెస్తోందని దుయ్యబట్టారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని, సమైక్యతను కాపాడుకోవాలని కోరారు. దేశంలో అధ్యక్ష తరహా పాలన తెచ్చేందుకు వాజ్‌పేయి హయాం నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఒకేసారి జమిలి ఎన్నికలను నిర్వహించేందు కు కేంద్రం సిద్ధమవుతోందన్నారు. స్థానిక, రాష్ట్ర అంశాలు చర్చకు రాకుండా జాతీయ అంశాలకే ప్రాధాన్యత ఇస్తే ఫెడరలిజం నాశనమవుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలో లోపాలున్నా దీన్ని రక్షించుకోవడం అందరి కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, ట్రస్టు సభ్యులు సి సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పిడిటి చారి ప్రసంగాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తెలుగులోకి అనువాదం చేశారు.

27న బిసిసిఐ సమావేశం

వరల్డ్‌కప్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుపై చర్చ



ముంబయి : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ నెల 27న కీలక సమావేశం కానుంది. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు భారత్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో మెగా ఈవెంట్ నిర్వహణకు బీసీసీఐ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశంలో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుపై చర్చతో పాటు సభ్యులను సైతం నియమించే అవకాశం కనిపిస్తుంది. మే 28న ఐపీఎల్ 16 ఫైనల్ అహ్మదాబాద్‌లో జరుగనుంది. ఐపీఎల్ ఫైనల్ ముందు రోజు అహ్మదాబాద్‌లోనే బీసీసీఐ ప్రత్యేక సర్వ సభ్య సమావేశం (ఎస్‌జీఎం) భేటీ కానుంది. ఐదు పాయింట్లతో కూడిన ఎజెండాతో బీసీసీఐ కార్యదర్శి జై షా రాష్ట్ర క్రికెట్ సంఘాలకు నోటీసు పంపించారు. మౌళిక సదుపాయల అభివృద్ధి అండ్ సబ్సిడి కమిటీ ఏర్పాటు, రాష్ట్ర క్రికెట్ జట్లకు ఫిజియోథెరపిస్ట్‌లు, ట్రైనర్ల నియామకాలపై మార్గదర్శకాలు, 2023 ఐసీసీ ప్రపంచకప్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు, మహిళల ప్రీమియర్ లీగ్ కమిటీ ఏర్పాటు సహా లైంగిక వేధింపుల నిరోధక విధానంపై ప్రత్యేక సర్వ సభ్య సమావేశంలో చర్చించనున్నారు.

వరల్డ్‌కప్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు వాయిదా పడుతూ వచ్చింది. ఈ కమిటీ ఏర్పాటుతో ప్రపంచకప్ వేదికల ఖరారు ప్రక్రియ పూర్తి కానుంది. ఇక ప్రపంచకప్ ముంగిట పలు స్టేడియాల ఆధునీకరణకు బీసీసీఐ భారీగా నిధులు వెచ్చించనుంది. స్టేడియాల ఆధునీకరణ పనులపై ఓ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. మహిళల ప్రీమియర్ లీగ్ పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించేందుకు బోర్డు సిద్ధమవుతోంది. ఇక భారత రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన నేపథ్యంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయకపోవటాన్ని ప్రశ్నిస్తూ ఇటీవల జాతీయ మానవ హక్కుల కమిషన్ బీసీసీఐకి నోటీసులు ఇచ్చింది. దీంతో బీసీసీఐలో లైంగిక వేధింపుల నిరోధక వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర క్రికెట్ జట్ల ఫిజియోలు, ట్రైనర్ల నియామకాలకు కనీస అర్హత, అనుభవాన్ని బోర్డు నిర్దేశించే అవకాశం కనిపిస్తుంది.

ఆస్ట్రేలియాకు కాస్త మొగ్గు!

డబ్ల్యుటిసి ఫైనల్‌పై రికీ పాంటింగ్



న్యూఢిల్లీ : ఐసిసి 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాకు కాస్త అనుకూలత ఉండనుందని ఆ జట్టు మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ' ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ వేదిక లండన్‌లోని ది ఓవల్ మైదానం. అక్కడి పరిస్థితులు ఆస్ట్రేలియాను పోలి ఉంటాయి. ఇది ఆసీస్‌కు కాస్త మొగ్గు. ఈ మ్యాచ్ భారత్, ఆస్ట్రేలియాలో ఎక్కడ జరిగినా ఆతిథ్య జట్టు ఫేవరేట్‌గా ఉండేది. కానీ వేదిక ఇంగ్లాండ్ కావటంతో సరసమైన పోటీకి అవకాశం ఏర్పడింది' పాంటింగ్ అన్నారు. 1990-2000 భారత జట్లతో పోల్చితే ప్రస్తుత టీమ్ ఇండియా విదేశీ గడ్డపై ఎంతో మెరుగ్గా రాణిస్తుంది. బ్యాటింగ్ నైపుణ్యం, వికెట్ల వేటలో పదును బాగున్నాయి. గత 10-15 ఏండ్లలో భారత్ నాణ్యమైన పేసర్లను తయారు చేసింది. బుమ్రా లేకపోవటం లోటే, కానీ ఇంగ్లాండ్ పరిస్థితుల్లో మహ్మద్ షమి ప్రమాదకర పేసర్. విరాట్ కోహ్లికి బౌలింగ్ చేయటం ఏ బౌలర్‌కైనా సవాలే. ఇటీవల బెంగళూర్‌లో కోహ్లితో మాట్లాడాను. కెరీర్ ఉత్తమ దశలోకి మళ్లీ వచ్చినట్టు అతడు చెప్పాడు. సన్‌రైజర్స్‌పై మ్యాచ్‌లో అందరం అది చూశాం. డబ్ల్యుటిసి ఫైనల్లో ఉత్కంఠ పోటీ కోసం ఎదురు చూస్తున్నాను' అని పాంటింగ్ అన్నారు.



చాలెంజర్ ట్రోఫీలో భారత్ సత్తా

జూనియర్స్‌లో పసిడి, యూత్‌లో సిల్వర్ కైవసం

హైదరాబాద్ : ఐహెచ్‌ఎఫ్ చాలెంజర్ ట్రోఫీలో భారత్ సత్తా చాటింది. అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య నిర్వహించిన ప్రతిష్టాత్మక టోర్నీలో భారత మహిళల జట్టు అదరగొట్టింది. జూనియర్ విభాగంలో చాంపియన్‌గా, యూత్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. ఈ నెల 13-18న ఢాకాలో జరిగిన టోర్నీలో భారత్ సహా నాలుగు దేశాలు పోటీపడ్డాయి. జూనియర్ విభాగం ఫైనల్లో 48-17తో బంగ్లాదేశ్‌పై భారత్ గెలుపొందగా.. యూత్ విభాగంలో 43-46తో బంగ్లాదేశ్‌కు భారత్ పసిడి కోల్పోయింది. చాలెంజర్ ట్రోఫీలో పతకాలు సాధించిన భారత మహిళల జట్లకు జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అభినందనలు తెలిపారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68